# ధరణి కంటే మెరుగైన వ్యవస్థను తీసుకొస్తాం

## పాలకుల నిర్లక్ష్యంతోనే గద్వాల అభివృద్ధి చెందలేదు

## పాలమూరు జిల్లాను ఆదుకుంది కాంగ్రెస్సే

## 24 గంటలు కరెంటు నిరూపిస్తే మేం నామినేషన్లు వేయము

## టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శ



**హైదరాబాద్,నవంబరు7 :** పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందలేదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. గద్వాలలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభలో రేవంత్ ప్రసంగించారు. ఈ ప్రాంతాన్ని కేసీఆర్ సంపూర్ణంగా నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. మేము నిర్మించిన ప్రాజెక్టులతో ఈ ప్రాంతానికి కష్టాలు వచ్చాయా కేసీఆర్ అంటూ రేవంత్ ప్రశ్నించారు. పాలమూరు జిల్లాను ఆదుకుంది కాంగ్రెస్సేనని ఆయన అన్నారు. కేసీఆర్ చేసిందేమీ లేక అబద్దాలతో ప్రజలను నమ్మించాలని చూస్తున్నారన్నారు. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మీరు 24 గంటలు కరెంటు ఇచ్చినట్టు నిరూపిస్తే మేం నామినేషన్లు వేయమని.. లేకపోతే మీరు గద్వాల చౌరస్తాలో ముక్కు నేలకు రాస్తారా అంటూ ఛాలెంజ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఉచిత కరెంటు ఇచ్చి, బకాయిలు తొలగించి, కేసులు ఎత్తివేశామన్నారు. 18లక్షల పంపుసెట్లకు ఉచిత కరెంటు అందించామన్నారు. నిజంగా కేసీఆర్ కోటి ఎకరాలకు నీళ్లు ఇచ్చి ఉంటే.. తెలంగాణలో పంపుసెట్లు 18 లక్షల నుంచి 25 లక్షలకు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. రేవంత్ మాట్లాడుతూ.. "బలహీన వర్గాలకు న్యాయం జరగాలనే సరిత తిరుపతయ్యకు టికెట్ ఇచ్చాం. కాంగ్రెస్ గెలిస్తేనే బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం సాధ్యమవుతుంది. కాంగ్రెస్ వస్తుంది.. ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుంది.. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతీ మహిళకు చేయూతను అందిస్తాం. కేసీఆర్ ఖేల్ ఖతం.. దుకాణ్ బంద్ అని ప్రజలు అంటున్నారు. అందుకే ధరణి, 24గంటల కరెంటు విషయంలో కాంగ్రెస్‌పై అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. ధరణి కంటే మెరుగైన సాంకేతికత తీసుకొచ్చి రైతుల భూములను కాపాడుతాం. రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.15వేలు,రైతు కూలీలకు రూ.12వేలు అందిస్తా. 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు ప్రతీ ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తాం. ఎవరూ బిల్లులు కట్టకండి.. వచ్చే నెల కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుంది." అని రేవంత్ పేర్కొన్నారు.

# పాలేరు నుంచి బరిలో తమ్మినేని వీరభద్రం

## కోదాడ నుంచి బరిలో మట్టిపల్లి సైదులు

## మరో 3 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం



**హైదరాబాద్,నవంబరు7 :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీపీఎం పార్టీ మరో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కోదాడ నియోజకవర్గం నుంచి మట్టిపల్లి సైదులు, మునుగోడు నుంచి దోనూరు నర్సిరెడ్డి, ఇల్లందు నుంచి దుగ్గి కృష్ణలు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తారని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 14 మంది అభ్యర్థులతో తొలి జాబితా, ఇద్దరు అభ్యర్థులతో రెండో జాబితాను ఇప్పటికే సీపీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖమ్మం జిల్లా పాలేరు నుంచి బరిలోకి దిగనున్నారు. తమ్మినేని మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీపీఎం పార్టీ పోటీ చేస్తున్న అభ్యర్థులను నిన్న ప్రకటించామన్నారు. ఇవాళ మరో ముగ్గురు అభ్యర్థులను ప్రకటిస్తున్నామన్నారు. కోదాడ నుంచి మట్టిపల్లి సైదులు పోటీ చేస్తారని తెలిపారు. మునుగోడులో గతంలో బీజేపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి ఎన్నికల బరిలోకి రాబోతున్నారని.. వారిని సీపీఐ పార్టీ సమర్థిస్తుంది కానీ సీపీఎం పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. మునుగోడు అభ్యర్థిగా సీపీఎం సీనియర్ నాయకుడు దోనూరి నర్సిరెడ్డిని పోటీలో ఉంచుతామన్నారు. ఇల్లందు స్థానంలో కూడా మేమే అనివార్యంగా పోటీ చేయాల్సి వస్తుంది.. అక్కడ దుగ్గి కృష్ణను సీపీఎం పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉంచుతున్నామన్నారు. మేము అభ్యర్థులను నిలబెట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీ స్పందించిందన్నారు. సీపీఐ పార్టీ ఏ విధంగా అయితే ఒక సీటును తీసుకొని ఒప్పందం కుదుర్చుకున్నారో.. మీరు కూడా అలానే సర్దుకోవాలని చెప్పినా మేం వ్యతిరేకించామని తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ఈ విషయాన్ని మా కేంద్ర కార్యవర్గానికి కూడా తెలియజేసి బలంగా ఉన్న ఖమ్మం జిల్లాలో ఒక్క సీటు కూడా ఇవ్వకుండా మేము ఎలా ముందుకు వెళ్తామని సమాధానం చెప్పడంతో వారి సలహా మేరకు మా రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం మేరకు స్వతంత్రంగా పోటీ చేయడమే ముఖ్యమని మేము ప్రజల్లోకి పోబోతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇక చర్చలేమీ లేవని, మేము స్వతంత్రంగానే ఎన్నికల్లో దిగుతున్నామన్నారు. ఇక మిగిలిన స్థానాలకు వచ్చేసి గతంలోనే చెప్పామన్నారు. ప్రజాస్వామికవాదులు, బీఎస్పీ భావజాల పార్టీ లాంటి వాటితో మేము కలిసి వెళ్లబోతున్నామన్నారు. బీజేపీ పార్టీ పోటీ చేసే స్థానాలలో కచ్చితంగా ఆ అభ్యర్థులను ఓడించాలని మాత్రమే మేము ప్రజలకు సూచిస్తున్నామన్నారు. ఏ ఒక్కరి గెలుపుకోసమో ఏ ఒక్కరి ఓటమి కోసమో సీపీఎం పార్టీ పని చేయదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు.

# ఇండియా కూటమిలో సరైన నాయకుడే లేడు

## కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్



**న్యూఢిల్లీ,నవంబరు7 :** అసెంబ్లీ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లో మహాదేవ్ బెట్టింగ్ యాప్ తీవ్ర కలకలం రేపుతోంది. బెట్టింగ్ యాప్ స్కాంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటలయుద్ధం నడుస్తోంది. తనపై బీజేపీ చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ ఘాటైన కౌంటరిచ్చారు. నవంబర్ 17 వరకు ఎంజాయ్ చేయండంటూ బీజేపీ విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ బెట్టింగ్ యాప్‌ను చూపిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నవంబర్ 17 వరకు ఎంజాయ్ చేయగలదు. కానీ.. ఈ ఆరోపణలు ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపవంటూ పేర్కొన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే ఇలాంటి ప్రయత్నాలను ఎన్నికల సంఘం ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ వ్యాఖ్యల అనంతరం.. బీజేపీ నేతలు కూడా కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మహాదేవ్ బెట్టింగ్ యాప్ వ్యవహారంపై భూపేష్ బఘేల్ టార్గెట్ గా విరుచుకుపడ్డారు. భూపేష్ బఘేల్ ప్రశ్నల నుంచి తప్పించుకుంటున్నారు. మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఆయన ప్రజలకు లేదా దర్యాప్తు సంస్థలకు లేదా మీడియాకు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.. అంటూ కేంద్ర మంత్రి ఫైర్ అయ్యారు. అంతేకాకుండా.. కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఇండియా కూటమిపై కూడా విమర్శలు గుప్పించారు. తాను ఇప్పటికే చెప్పినట్లు, భారత కూటమిలో సరైన నాయకుడు లేదా విధానం లేదు.. వారి ఉద్దేశాలలో కూడా లోపం ఉందంటూ పేర్కొన్నారు. ఈ కూటమిలోని చాలా మంది నాయకులు అవినీతికి పాల్పడ్డారని.. తమను తాము రక్షించుకోవడానికి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. కాగా.. దుబాయ్‌లో ఉన్న మహాదేవ్ బెట్టింగ్ యాప్ యజమాని శుభమ్ సోని మాట్లాడిన వీడియో వైరల్ అయ్యింది. ఆ యాప్‌ను రూపొందించేందుకు భూపేశ్ తనను ప్రోత్సాహించారని శుభమ్ సోని ఆరోపించాడు. ఇప్పటివరకు ఆయనకు రూ.508 కోట్లు చెల్లించానంటూ పేర్కొన్నాడు. బెట్టింగ్ యాప్‌నకు అసలైన ఓనర్ సీఎం బఘేల్ అని వీడియోలో పేర్కొన్నాడు. భిలాయ్‌లో తన సహచరులు అరెస్టు అయినప్పుడు.. సీఎం తనని యూఏఈకి పారిపోవాలని సలహా ఇచ్చిన్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఈడీ చర్యలు ప్రారంభించిందని.. ఈ వ్యవహారం నుంచి తనని బయటపడేయాలంటూ భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించాడు. తొలిదశ పోలింగ్ ఇవాళ జరుగుతోంది. 17న రెండో దశ పోలింగ్ నిర్వహించనున్నారు.

# కాంగ్రెస్ హయాంలో రైతులకు అనేక కష్టాలు

- అప్పుల కోసం తలుపులు,మోటర్లు పీక్కుపోయింది మరుస్తామా
- ఇప్పుడిప్పుడే రైతుల మొఖాలు తెల్లబడుతున్నాయి
- కరెంట్, రైతుబంధుతో ఆనందంగా ఉన్నారు
- వారు వస్తే ఇవన్నీ ఆగమవుతాయి జాగ్రత్త
- బిసిలంతా చైతన్యం కావాలని పిలుపు
- మంథని సభలో సిఎం కెసిఆర్ ఘాటు విమర్శలు



**మంథని,నవంబర్7 :** కాంగ్రెస్ హయాంలో రైతులు ఎన్నో బాధలు పడ్డారని సీఎం కేసీఆర్ చెప్పారు. యాభై ఏండ్లకు పైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏనాడు రైతుల మేలును పట్టించుకోలేదని విమర్శించారు. మంథని నియోజకవర్గంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడిన సీఎం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని కట్టకపోతే తలుపులు పీక్కపోయిన విషయాన్ని గుర్తుచేశారు. కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తున్నమని గప్పాలు కొట్టిన ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కూ చురకలు వేశారు.'కాంగ్రెస్ హయాంలో పంట పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి అప్పు తెచ్చుకున్న రైతు తిరిగి కట్టకపోతే ఇంటి తలుపులు పీక్కపోయింద్రు. బావుల కాడి మోటార్లు ఎత్తుకపోయింద్రు. అంతేగానీ రైతుల కోసం నాడు ఒక్క రూపాయి ఇయ్యలే. ఇప్పుడు రైతు బంధు అనే పథకాన్ని సృష్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. దాంతో ఇయ్యాల్ల కొంచెం కొంచెం రైతుల మొఖాలు తెల్లబడుతున్నయ్. రైతుబంధు రూపంలో పెట్టుబడి వచ్చి, పంటలకు 24 గంటల కరెంటు వచ్చి ఇప్పుడిప్పుడే రైతులు గడ్డకుపడే పరిస్థితి వస్తున్నది' అని సీఎం చెప్పారు. 'గ్రామాలు సల్లగుండాలె, వ్యవసాయ స్థిరీకరణ జరగాలె, రైతులు మంచిగ బతుకాలె అని నిర్ణయించి తాము రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు తీసుకొచ్చినం. కానీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు దుబారా అంటున్నడు. కేసీఆర్‌కు ఏం పని లేక రైతు బంధు తెచ్చిండు అంటున్నడు. నిజంగా రైతుబంధు దుబారనేనా..? రైతు బంధును ఎత్తేసేందుకు కాంగ్రెస్ గొడ్డలి భుజాన పెట్టుకుని రెడీగా ఉన్నది. వాళ్లు గెలిస్తే రైతు బంధుకు రాం రాం అంటరు. తీర్థం బోదాం తిమ్మక్క అంటే నేను గుల్లె, నువ్వు సల్లె. తియ్యగ పుల్లగ మాట్లాడితె నమ్మి గోల్‌మాల్ కావద్దు. తర్వాత నేను చేయగలిగేది కూడా ఏముండదు. మీరే కొట్లాడాల్సి వస్తది. నేను 24 ఏండ్లు కొట్లాడిన. ఇగ మీదే బాధ్యత' అని అన్నారు.'ఇప్పుడున్న పీసీసీ అధ్యక్షుడు ఏమంటున్నడు..? కేసీఆర్ కరెంటును దుబారా చేస్తున్నడు, 24 గంటలు ఎందుకు, 3 గంటలు చాలు అంటున్నడు. మరి 3 గంటల కరెంటు సరిపోతదా..? కర్ణాటకల ఇదే కథ చేసింద్రు. ఎన్నికల ముందు 24 గంటలు ఇస్తమని చెప్పింద్రు. ఇప్పుడు 5 గంటలు ఇస్తున్నం అంటున్నరు. కానీ 4 గంటలే ఇస్తున్నరు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇక్కడ ఓ సభల మాట్లాడుతూ.. తమ దగ్గర రోజుకు 5 గంటల కరెంటు ఇస్తున్నం, కేసీఆర్ కావాలంటే నువ్వు బెంగళూరుకు రా సూద్దువు అంటున్నడు. దానికి నేనేమన్నా? 24 గంటల కరెంటు ఇస్తోళ్ల దగ్గరికొచ్చి నువ్వు 5 గంటలు ఇస్తున్నం అంటే దేంతోటి నవ్వాలా బాబు నాకర్థతమైతలేదని చెప్పిన' అని సీఎం వ్యాఖ్యానించారు. : కొంతమంది నాయకులు పైసల కోసం అమ్ముడుపోవచ్చు.. కానీ మంథని ప్రజలకు చైతన్యం ఉంది.. నీవేం రంది పడాల్సిన అవసరం లేదని మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధుకు ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసా కల్పించారు. మంథని నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.బీఆర్ఎస్ పార్టీకి హైకమాండ్ ఢిల్లీలో ఉండదు. మన బాసులు తెలంగాణ ప్రజలే. ప్రజలు ఏది కోరితే అదే జరుగుతది. మన నిర్ణయాలు ఇక్కడే జరుగుతాయి. కాంగ్రెస్ పార్టీలో మాత్రం ఢిల్లీలో స్విచ్ వేస్తేనే ఇక్కడ లైట్లు వెలుగుతాయి. ఇవన్నీ వట్టి పోసిగాళ్లే. టికెట్ల కోసం ఆఫీసులు కాలబెట్టుకుంటున్నారు. అలా లేదు మన దగ్గర. అందర్నీ బ్యాలెన్స్ చేసుకుని ముందుకు పోతున్నాం. వారికి డజన్ మంది సీఎంలు. ఏడాదికి ఎంత మంది మారుతరో తెలియదు.. కర్ణాటకలో ఏం జరుగుతుందో చూస్తున్నాం. ఒక నిశ్చితమైన అభిప్రాయం లేకుండా, ఒక సిద్ధాంతం లేకుండా, రాష్ట్రానికో నీతి పెట్టారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ కదా..? తెలంగాణలో ప్రకటించిన స్కీమ్స్ ఛత్తీస్‌గఢ్‌లో పెట్టారా..? పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లో చేస్తున్నారా..? ఏ ఎండకు ఆ గొడుగు పట్టి ఎన్నికలు అయిపోగానే బయటపడాలనేది కాంగ్రెస్ పని అని కేసీఆర్ ధ్వజమెత్తారు. మీ మధ్యలో ఉండే మధును గెలిపించాలి. పుట్ట మధు అద్దైర్య పడుతున్నారు. కొంత మందిని కొనుక్కుపోతున్నారని. వారి మీద ఊర్లో రియక్షన్ వస్తది. నువ్వేం చితించే పని లేదు. కొన్నోడు, అమ్ముడు పోయినోడు ఎవరో తెలిసిపోతది. నేను కరీనంరగ్ ఎలక్షన్ల ఉన్నప్పుడు అట్లనే చేశారు. చొప్పదండి నియోజకరవ్గంలో ఐదుగురు పార్టీ మండల అధ్యక్షులను కొనేశారు. ఆ ఊర్లలో వారిని దంచింద్రు.. ఐదు ఓట్లు కూడా రాలేదు. ఇక్కడ కూడా అదే జరుగుతది. నీవేం రందీపడకు ప్రజలకు చైతన్యం ఉంది. ఆ పైసల కోసం మోసపోయేటోళ్లు కాదు ప్రజలు. కొంతమంది పిచ్చి నాయకులు గొర్రెల్లాగా పోవొచ్చు కానీ.. ప్రజలకు అది లేదు. పోయిన సారి జరిగిన నష్టం తెలిసింది. నూరు కథల పద్దా.. ప్రజల మనసులో ఏముందంటే గ్యారెంటీగా బీఆర్ఎస్ సర్కార్ వస్తది అందులో అనుమానం లేదు. అలాంటప్పుడు మధు ఉంటే లాభమైతది.. వేరే ఆయన ఉంటే లాభమైతదా..? గవర్నమెంట్ ఉన్న ఎమ్మెల్యేనే రావాలి.. అప్పుడే లాభం జరుగుతది. మంథని ఎమ్మెల్యేగా మధు గెలిస్తేనే మీకు లాభం జరుగుతుంది. ఎక్కడికి పోయినా పని చేసుకొచ్చే సామర్థ్యం ఆయనకు ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. బీసీ బిడ్డలకు అవకాశం రావడం లేదని.. అవకాశం వచ్చినకాడ చైతన్యం ఏమైందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రశ్నించారు. మంథని ఎమ్మెల్యేగా బీసీ బిడ్డ పుట్ట మధును గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'బీసీ బిడ్డలకు అవకాశం రావడం లేదు. మంథనిలో ఉన్న ప్రతి ఒక్క బీసీతో మాట్లాడుతన్న. రానికాడ టికెట్ రాకపాయే.. వచ్చిన కాడ చైతన్యం ఏమైతున్నట్టు.. ? నేను మంథనిలో బీసీ బిడ్డలతో పంచాయితే పెట్టుకుంట నేను చెబుతున్నారు. ఇవాళ నేను వెళ్లి తర్వాత ప్రతి బీసీ ఇంట్లో, ప్రతి బలహీన వర్గాల ఇంట్లో చర్చ జరగాలి' అని పిలుపునిచ్చారు. బీసీ నాయకుడు.. బలంగా ఎదిగి వచ్చి పని చేస్తుంటే.. ఎందుకు అతన్ని ఇబ్బంది పెట్టాలి ? అవకాశాలు వచ్చేదే తక్కువ మందికి. అవకాశం వచ్చినప్పుడు మన బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ఐక్యత ఎందుకు లోపిస్తున్నది ? నేను మీ అందరికీ అప్పీల్ చేస్తున్నా. ఎవరైతే బీసీ ఉద్యోగస్తులున్నరో.. బీసీ విద్యార్థులున్నరో.. బీసీ రిటైర్డ్ ఎంఎ÷-లాయీస్ ఉన్నరో దయచేసి మీ చైతన్యాన్ని ఈ ఎన్నికల్లో చూపించాలి. పుట్ట మధు గత ఎన్నికల్లో ఓటమిపాలైనా.. వెంటనే వచ్చిన అవకాశంతో జడ్పీ చైర్మన్‌ను చేసుకున్నాం.

# కాంగ్రెస్,బిజెపిలను ప్రజలను నమ్మేస్థితి లేదు

- అభివృద్ధి చేసిన బిఆర్ఎస్‌కే పట్టం కట్టాలి
- మరోమారు ఎమ్మెల్యేగా సేవలందిస్తా
- కరీంగనర్ ప్రచారంలో మంత్రి గంగుల



**కరీంనగర్,నవంబర్7 :** బీజేపీ కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రానున్నది కెసిఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. అభివృద్ధి చేసిన వారికే ఓటు వేయండితనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే కరీంనగర్ నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని గంగుల అన్నారు. మంగళవారం రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీమంత్రి గంగుల కమలాకర్ ముగ్ధంపుర్ , మందులపల్లి గ్రామాల్లో ప్రచారం కొనసాగించారు గడప గడపకు వెళ్లి మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారుకాంగ్రెస్ బిజెపిలకు విలువైన ఓటు వేసి వృధా చేయొద్దని, ఆ రెండు పార్టీలు ఒకటేనని... వారికి అధికారం కట్టబెడితే... మరోసారి తెలంగాణను ఆంధ్రలో విలీనం చేసి... ఇక్కడి సంపదను కొల్లగొడుతారని గంగుల అన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్ధంపుర్ , మందులపల్లి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంగళ హారతులు, గజమలతో స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ళ మధ్య పాదయాత్రగా ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. మంత్రి మాట్లాడుతూ ఓటు అమూల్యమైనదని ఒక్క ఓటు తప్పు జరిగితే తెలంగాణ మళ్ళీ అంధకారం అవుతుందని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు కావాలా... లేదా ఎన్నికలప్పుడే కనిపించి ఆ తర్వాత కనిపించకుండా పోయి.. జైలుకు వెళ్లి వచ్చే నాయకుడు కావాలో ఆలోచించుకో వాల న్నారు. సియం కెసిఆర్... బిఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని... మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని పిలు పునిచ్చారు. తాను ఎమ్మెల్యే కాక ముందు ముగ్ధంపూర్ ఎలా ఉండేది... ఇప్పుడు ఎలా ఉందో ఆలోచించుకోవాలన్నారు. సమైక్య పాలనలో రోడ్డు లేక ఇబ్బం దులు పడ్డ రోజులు ఇంకా గుర్తున్నాయని... కానీ స్వయం పాలనలో ముగ్ధంపూర్లో గొప్పగా రోడ్లను నిర్మించామన్నారు. గత పాలకులు ఎన్నికలప్పుడే కనిపించి... మళ్లీ కనిపించేవారు కాదని... నేను 2009 ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన తర్వాత... మీ మధ్యే ఉం టూ... మీరు అడిగిన ప్రతి ఒకటీ నెరవేర్చానన్నారు. కరీంనగర్ అభి వృద్ధి కోసం నాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని నిధులు అడిగితే వెకిలిగా నవ్వాడే తప్పా... రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయం పాలనలో కెసిఆర్ సీఎం అయిన తర్వాత వందలాది కోట్లు తెచ్చి ముగ్ధంపూర్ ను అభివృద్ధి చేశా నని... ఆ అభి వృద్ధి ఇప్పుడు మీ కళ్ళ ముందే ఉందన్నారు. సమైక్య పాలనలో సాగునీటి కోసం కరెంటు కావా లని ఆందోళన చేస్తే నా కాళ్లు విరగగొట్టారని... ఇప్పటికీ ఆనొప్పి నన్ను వేధిస్తూనే ఉందన్నారు. సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు... కెనాల్ లోని నీటిని అడ్డుకొని మన పొలాల్లోకి మళ్ళించిన దృశ్యాలు ఇంకా కళ్ళ ముందు కదలాడుతూనే ఉన్నాయ న్నారు. ఇప్పుడు కెనాల్ లో రెగ్యులేటర్ నిర్మించి సాగునీటి సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో కష్టాలన్నీ తొలగిపోయి మన బతుకులు తెల్ల ముఖమయ్యాయని... పచ్చని తెలంగాణను మళ్ళీ ఆంధ్రాలో కలిపి... దోచుకునేందుకు షర్మిల కిరణ్ కుమార్ రెడ్డిలు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి కి అధికారం ఇస్తే తెల్ల ముఖాన్ని... నల్ల ముఖం చేసి... ఇక్కడి సంప దను దోచుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. కెసిఆర్ పాలనలో... ఇక్కడి రైతులు భూమికి బరువయ్యే పంటలు పండిస్తూ సంతోషంగా ఉన్నా రని... ఇప్పుడు ఒక్క ఓటు తప్పు జరిగితే తెలంగాణ మళ్లీ అంధకారం అవుతుందన్నారు. తెలంగాణలో ఆంధ్రా వాళ్ళు పాగా వేసి ఇక్కడి సంపదను దోచుకుంటారన్నారు. ఆది నుండి నాకు అండగా నిలి చిన ముగ్ధంపూర్ అంటే నాకు ఇష్టమని... అందుకే ఇక్కడ తెలం గాణలోనే ప్రతిష్టాత్మకమైన మహిళ బీఎస్సీ అగ్రికల్చరల్ కాలేజీ తో పాటు... పల్లె దవఖానాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంగుల మాట ఇస్తే తప్పే మనిషి కాదని... ఎన్నికలవేళ తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు మరోసారి కాంగ్రెస్ బిజెపి వస్తున్నాయన్నారు. ఈ ప్రాంత ఎంపీగా గెలిచిన తర్వాత బండి సంజయ్ ఎప్పుడైనా మీకు కనిపిం చాడా అంటూ అడిగి తెలుసుకున్న గంగుల... భూ కబ్జాదారుడు... 30 కిపైగా కేసులతో... బైండోవర్ చేసిన వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని దుయ్యబట్టారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేస్తాడా... లేక కోర్టుల చుట్టూ తిరుగుతాడా ఆయనకే తెలియాలని... పచ్చని తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టొద్దన్నారు. ఢిల్లీ పార్టీలకు అధికారం కట్టబెడితే... కాంగ్రెస్ బిజెపిలు ఒకటై తెలంగాణను దోచుకుంటాయన్నారు.మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.


# బిజెపి అధికారంలోకి వస్తే బిసి సిఎం

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలను విడిచిపెట్టామని కాంగ్రెస్ నేతలు మాపై ఆరోపణలు చేస్తున్నారు. అవినీతి సొమ్ము తిన్న ఏ ఒక్కరినీ వదిలేది లేదు. అవినీతి చేసిన వారిని కచ్చితంగా జైలులో వేస్తాం.' ప్రధాని మోదీ హెచ్చరించారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఈ ప్రభుత్వం అతి పెద్ద మోసం బీసీలకు చేసిందని ప్రధాని మోదీ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలను ఎప్పుడూ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. వారు ఎప్పుడూ తమ కుటుంబం కోసమే పని చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనేది బీఆర్ఎస్ పార్టీకి సీ టీమ్ అని అన్నారు. హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో తెలంగాణ బీజేపీ నిర్వహించిన భారీ బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ పైన, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రమైన విమర్శలు చేశారు. వీరు ఏనాడూ బీసీ వ్యక్తిని సీఎం చేయాలని ఆలోచించలేదని అన్నారు. దళితులు, పీడితులు, ఆదివాసీలకు ఎప్పుడూ బీజేపీ అండగా ఉంటుందని అన్నారు. 'అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం సమయంలో మేమే ఏపీజే అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేశాం. జీఎంసీ బాలయోగిని బీజేపీ తొలి దళిత లోక్ సభ స్పీకర్ ను చేసిందని గుర్తు చేశారు. అలాగే తొలి దళిత రాష్ట్రపతిగా కూడా రామ్ నాథ్ కోవింద్‌ను చేసిందని, అలాగే ద్రౌపది ముర్ము ను రాష్ట్రపతిగా చేసి తొలి ఆదివాసీ వ్యక్తిని దేశాధినేత చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని అన్నారు. తెలంగాణలో ఇప్పుడు బీసీ వ్యక్తి సీఎం కాబోతున్నారు. నా కుటుంబ సభ్యులారా.. అహంకారం ఉన్నవారికి ప్రజలు ఓట్లు వేయరు. బీఆర్ఎస్ నేతల్లోనూ అలాంటి అహంకారం కనిపిస్తుంది. అవినీతి ప్రభుత్వాన్ని ఈసారి ఇంటికి పంపడం ఖాయం.

# మీరు పడ్డ గోసలను యాది చేసుకోండి

- మీ కోసం యుద్ధం చేసి జైలుకు పోయిందెవరో చూడండి
- ఒక్క ఉద్యోగం భర్తీ చేయకుండా జాబ్ క్యాలెండర్ అంటే నమ్మేదెవరు?
- బీజేపీకి అవకాశమిస్తే... 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం
- బీసీ నాయకుడే ముఖ్యమంత్రి అవుతారు
- కరీంనగర్ లో పాదయాత్ర ప్రారంభించిన బండి సంజయ్



**కరీంనగర్,నవంబర్7 :** నిరుద్యోగ తమ్ముళ్లారా...... కేసీఆర్ రాక్షస పాలనలో మీరు పడ్డ గోసలు ఈ 23 రోజులు గుర్తుచేసుకోండి. మీ కుటుంబాలు పడుతున్న బాధలను యాది చేసుకోండి. 9 ఏళ్లుగా ఒక్క ఉద్యోగం భర్తీ చేయకుండా జాబ్ క్యాలెండర్ అంటూ మభ్యపెడుతున్న దండుపాళ్యం ముఠా మాటలు నమ్మకండి. అట్లాగే మీకోసం యుద్ధం చేసిన బీజేపీని గుర్తుంచుకోండి. రాబోయే ఎన్నికల్లో మీరిచ్చే తీర్పుతో బీఆర్ఎస్ నేతల మైండ్ బ్లాంక్ కావాలె....' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీబండిసంజయ్‌కుమార్ యువకులకు పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట మేరకు బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయ డంతోపాటు ఏటా జాబ్ క్యాలెండర్ ను ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. వయోపరిమితిని సడలించి నిరుద్యోగులకు జరిగిన నష్టాన్ని పూడుస్తామన్నారు. బీసీ నాయకుడే సీఎం అవుతారని ఉద్ఘాటించారు. కేసీఆర్ కు దమ్ముంటే... ఆయన రాజకీయ వారసుడెవరో ఎన్నికల తరువాత ఎవరిని సీఎం చేస్తారో ప్రకటించాలని సవాల్ విసిరారు. కరీంనగర్ లోని 24వ డివిజన్ లో పాదయాత్ర ప్రారంభించిన బండి సంజయ్ పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ఓటేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నిన్న నామినేషన్ దాఖలు చేసిన. పాదయాత్ర చేస్తూ ప్రజలను కలుసుకుంటున్న. నిన్న నామినేషన్ కార్యక్రమానికి స్వచ్ఛం దంగా యువత వేలాదిగా తరలివచ్చి భారత్ మాతా కీ జై... జై శ్రీరాం అంటూ బీజేపీకి మద్దతు తెలిపారు. ఈ ర్యాలీ చరిత్ర సృష్టించింది. బీజేపీ విజయానికి ఇది సంకేతం. బీఆర్ఎస్ నేతలకు ఈ ర్యాలీని చూసి మైండ్ బ్లాంక్ అయ్యింది. ఇప్పుడు పెద్ద ఎత్తున డబ్బులిచ్చి వేల మందిని తీసుకొచ్చి పోటీగా ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్ఎస్ నేతలు యత్నిస్తున్నారు. మీరెన్ని చేసినా గెలుపు బీజేపీదే. ఇది నా మాట కాదు.. కేసీఆరే నిర్ణయానికి వచ్చారు. అందుకే బి.ఫాం ఇవ్వకుండా చాలా రోజులు ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిని తిప్పలు పెట్టిండు. దీనినిబట్టి తీర్పు ఎప్పుడో డిసైడ్ చేశారు. బండి సంజయ్ అవినీతిపరుడు కాదు... ఎక్కడా భూ కబ్జాలు చేయలే. ఎవరినీ ఇబ్బంది పెట్టలే. ఇయాళ బీఆర్ఎస్ నేతల లెక్క లంగ దందా, దొంగ దందాలు చేసేటోడిని వెంటపెట్టుకుని తిరగలే. కమీషన్లు ఇప్పిస్తేనే పోలీస్ స్టేషన్లలో పనులు అయ్యేటట్లు నేను చేయడం లేదన్నారు. నన్ను ఎంపీగా గెలిపిస్తే వేల కోట్ల నిధులు తీసుకొచ్చిన. అభివృద్ధి చేస్తున్న. కేంద్ర నిధులు తీసుకొచ్చిన. కానీ అభివృది అడ్డుకుంటోందెవరు. రేషన్ కార్డు కూడా ఇయ్యలేనోడు ఎవరు ఆలోచించుకోవాలన్నారు.బండి సంజయ్ పేదల కోసం పోరాడుతున్నడు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతునైన. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పోరాటాలు చేసి సమాజాన్ని ఏకం చేసిన. ఇప్పుడు నేను గెలిస్తే... ఆయనకు ఏకు మేకు అవుతాననే భయంతో కరీంనగర్ కు వందల కోట్లు పంపి నన్ను ఓడించాలని చూస్తున్నడు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్ లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు

**ఛత్తీస్‌గఢ్,నవంబరు7 :** ఛత్తీస్‌గఢ్ తొలివిడత ఎన్నికలు ఈ రోజు జరుగుతున్నాయి. ఎన్నికల వేళ మావోయిస్టులు రెచ్చిపోయారు. ఈ రోజు మావోయిస్టులు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటన సుకుమా జిల్లాలోని తాడ్‌మెట్ల, దూలెడ్ గ్రామాల మధ్య పనావర్ అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగింది. దాదాపుగా 20 నిమిషాల పాటు కాల్పులు కొనసాగాయి. ఎన్నికల నిర్వహణకు వెళ్లిన బీఎస్ఎఫ్ డీఆర్‌జీ బృందంపై నక్సలైట్లు కాల్పులు జరిపారు. ప్రస్తుతం భద్రతాసిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తోంది. ఈ ఘటన బండే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనా స్థలం నుంచి పోలీసులు ఏకే 47ను స్వాధీనం చేసుకున్నారు.ఇదిలా ఉంటే నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడూర్ అడవుల్లో ఎస్టీఎఫ్, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగినట్లు సమాచారం. భద్రతాబలగాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు, అయితే ఇద్దరు ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు, వారి మృతదేహాలను తీసుకుని అటవీ ప్రాంతాల్లోకి పారిపోయినట్లు తెలుస్తోంది. దక్షిణ బస్తర్ దంతెవాడ జిల్లాలోని మన్వా గ్రామంలో ఎన్నికలకు భద్రత కల్పించేందుకు 206 కోబ్రా బెటాలియన్‌కి చెందిన సైనికులు అటవీ ప్రాంతంలో మోహరించారు. ఈ తెల్లవారుజామున సుకుమాలోని తొండమార్క ప్రాంతంలో మావోయిస్టులు జరిపిన పేలుడులో ఎన్నికల విధుల్లో ఉన్న సీఆర్పీఎఫ్ కోబ్రా సిబ్బంది గాయపడ్డారు. ఛత్తీస్గఢ్‌లోని 90 అసెంబ్లీ స్థానాల్లో 20 స్థానాలకు ఈ రోజు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవన్నీ మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ప్రాంతంలోనే ఉన్నాయి. దీంతో ఎన్నికల నిర్వహణ కోసం దాదాపుగా 60 వేల మంది భద్రతా సిబ్బంది మోహరించారు. 2018లో ఈ 20 సీట్లలో కాంగ్రెస్ 17 స్థానాల్లో విజయం సాధించగా..బీజేపీ 2 స్థానాల్లో విజయం సాధించింది.

## ఏదో ఒక రోజు సీఎం అవుతా..

### అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు

### కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్,నవంబరు7 :** కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి పదవిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదో ఒక రోజు సీఎం అవుతానని ఆయన అన్నారు. కానీ నాకు సీఎం కావాలని లేదని కోమటిరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా తన హయాంలోనే జరిగిందన్నారు. మీ ఆదరణ చూస్తుంటే చర్మం వలిచి చెప్పులు కుట్టించినా తక్కువేనని ఆయన అన్నారు. మాయమాటలు చెప్పి 2018లో బీఆర్ఎస్ గెలిచి.. మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పోలింగ్‌కు ముందు రైతుబంధు డబ్బులు అకౌంట్‌లో వేస్తారు.. మోసపోవద్దన్నారు. ఏపీలో కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుంది అని తెలిసినా సోనియా గాంధీ తెలం గాణ రాష్ట్రం ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. ఉద్యోగ ఖాళీల భర్తీలో ప్రభుత్వం విఫలమైందన్నారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. ఆత్మహత్యల కోసం తెలంగాణ తెచ్చుకోలేదన్నారు.ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు సరైన సమయంలో అందించడంలో కేసీఆర్ సర్కార్ విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఉపాధి అవకాశాలు కల్పన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకటో తేదీనే జీతాలు ఇస్తామన్నారు.


## రాజాసింగ్‌పై మరో రెండు కేసులు నమోదు



**హైదరాబాద్,నవంబరు7 :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మరోసారి కేసు నమోదైంది .రెండు కేసుల్లో రాజాసింగ్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. నామినేషన్ రోజు విద్వేషపూరిత ప్రసంగం చేశారంటూ రాజాసింగ్‌పై కేసు నమోదు కాగా.. నవరాత్రి ఉత్సవాల్లో దాండియా నిర్వాహకులను బెదిరించారని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. ఇక దసరా ఆయుధపూజ రోజు నిషేధిత ఆయుధాలను బహిరంగంగా ప్రదర్శించినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన పోలీసులు వారం రోజుల్లో విచారణకు హాజరుకావాలన్నారు తెలంగాణ పోలీసులు.వివాదాస్పద ఎమ్మెల్యే రాజాసింగ్ కు మరోసారి షాక్ తగిలింది. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ రెండు కేసులు నమోదు చేశారు మంగళహాట్ పోలీసులు. నవరాత్రి ఉత్సవాల్లో రాజాసింగ్ విద్వేష పూరిత ప్రసంగం చేసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో ఆయనపై కేసు నమోదు చేశారు పోలీసులు. నవరాత్రి ఉత్సవాల్లో దాండియా ఈవెంట్ కు వచ్చే వారందరి గుర్తింపు కార్డులను తనిఖీ చేయాలన్నారు. ఈవెంట్ కోసం ముస్లిం బౌన్సర్లు డీజే ఆర్టిస్టులను రప్పిస్తే దాడులు చేస్తామని ఆ వీడియోలో పేర్కొన్నారు ఎమ్మెల్యే రాజాసింగ్. ఈ క్రమంలోనే స్థానిక నాయకుడు సమద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళాట్ పోలీసులు ఐపిసి 153ఏ,295 %ఖు, ఖతీఎం ఖషీ%, 504 సెక్షన్ల కింద ఎమ్మెల్యే రాజాసింగ్ పై కేసు నమోదు చేశారు.అంతకుముందు దసరా సందర్భంగా నిర్వహించే ఆయుధ పూజ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ వెపన్స్ తో పాటు తల్వార్లను ప్రదర్శించడంతో రాజాసింగ్ పై కేసు నమోదు చేశారు మంగళహాట్ పోలీసులు. అందులో ప్రదర్శించిన తుపాకులు రాజాసింగ్ వ్యక్తిగత భద్రత సిబ్బందివని, వాటిని ప్రదర్శించడం నిషేధమన్నారు పోలీసులు. వెపన్స్‌తో పాటు కత్తులను ప్రదర్శించడం చట్ట విరుద్ధమని అంటున్నారు పోలీసులు. దీంతోనే ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు చేశామని చెప్తున్నారు. వారం రోజుల్లోగా నోటీసులకు స్పందించి రాజాసింగ్ వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు పోలీసులు.మరోవైపు ఈ రెండు కేసులపై స్పందించిన ఎమ్మెల్యే రాజాసింగ్ తనను ఎన్నికల్లో నుండి అనర్హుడయ్యేలా చూడాలన్న ఉద్దేశంతోనే ఈ కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుధ పూజ సందర్భంగా ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు కూడా పూజలు చేస్తారని, వారందరిపై కూడా కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు ఎమ్మెల్యే రాజాసింగ్. ప్రభుత్వం కావాలనే తనను టార్గెట్ చేసి వేధింపులకు గురి చేస్తుందని ఒక వీడియో విడుదల చేశారు. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న తనను పార్టీ కార్యకర్తల మద్దతు దూరం చేసేందుకు కుట్ర జరుగుతుందని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు.

## ఎట్టి పరిస్థితుల్లో ప్రతిపక్షాలను ప్రజలు నమ్మరు

### డిప్యూటీ సీఎం నారాయణస్వామి



**అమరావతి,నవంబరు7 :** నవరత్నాలతో ప్రజలకు మంచి చేస్తుంటే చంద్రబాబు, ప్రతిపక్ష పార్టీలు కడుపు మంటతో ఉన్నాయని మండిపడ్డారు డిప్యూటీ సీఎం నారాయ ణస్వామి.. నంద్యాలలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఎన్నికలు వస్తున్నాయంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నా వాళ్లు అంటూ కల్లబొల్లి మాటలు చెప్పేందుకు చంద్రబాబు సిద్ధమవుతాడు అంటూ టీడీపీ అధినే తపై విరుచుకుపడ్డారు.. ఇక, బీసీలను ఏనాడు పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు మాయమా టలు చెప్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్న ఆయన.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాపుల ఓట్ల కోసం చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేందుకు పాకులాడుతున్నారని దుయ్యబట్టారు.. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా..? అనే చంద్రబాబు మాటలు ప్రజలు మర్చిపోరన్నారు.. చంద్రబాబు వెన్నుపోటు చరిత్ర దేశం అంతా తెలుసు.. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు చేసిన ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మబోరని తెలిపారు. నవరత్నాలతో ప్రజలకు మంచి చేస్తుంటే చంద్రబాబు, ప్రతిపక్ష పార్టీలు కడుపు మంటతో ఉన్నాయని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు కలిసివచ్చినా.. కుయూక్తులతో వచ్చినా.. సీఎం జగన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సింగిల్‌గానే వస్తుంది.. మళ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తుంది.. మరోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డే ఉంటారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు డిప్యూటీ సీఎం నారాయణస్వామి..

# ఉమ్మడి నల్లగొండలో రెడ్ల ఆధిపత్యం

### తొలిసారి పోటీలో హల్‌చల్ చేస్తున్న బిసివర్గాలు











**నల్గొండ,నవంబర్7 :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తిరిగి పట్టు సాధించాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. మహామహులంతా ఇక్కడ రంగంలో ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి రెడ్డి సామాజిక వర్గం అగ్రనేతలు బరిలిలో ఉన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, జానారెడ్డి తనయుడు పోటీలో ఉన్నారు. దీంతో కాంగ్రెస్ రెడ్లు, ఇతర పార్టీల్లోని బీసీ అభ్యర్థులకు నడుమ పోటీ రసవత్తరం కానుంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్?, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, నుంచి బలమైన బీసీ క్యాండిడేట్లు బరిలో దిగడంతో ఆయా నియోజకవర్గాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ముఖ్యంగా బీఆర్ఎస్ తిరుగుబాటు అభ్యర్థులు ఉన్న నల్గొండ, సూర్యాపేట నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొంది. వట్టె జానయ్య, పిల్లి రామరాజు యాదవ్ వల్ల బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ సర్వేలు చెప్తుండగా, పార్టీ నుంచి వాళ్లు వెళ్లిపోవడం వల్ల తమకే మేలు జరుగుతుందని బీఆర్ఎస్ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేటతో పాటు ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి, గొంగిడి సునీత ఇలాకాల్లో బీసీ క్యాండేట్లు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయా పార్టీల్లోనే క్యాడర్ సైతం సామాజిక వర్గాల వారీగా చీలిపోవడంతో అగ్రనేతలకు టెన్షన్ మొదలైంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ గ్రనేతల ఆధిపత్యం నడుస్తున్న నియోజకవర్గాల్లో బీసీ లీడర్లు తలపడుతుండడం ఆసక్తిగా మారింది. నాగార్జున సాగర్‌లో జానారెడ్డి కొడుకు జయవీర్ రెడ్డితో సిట్టింగ్ ఎమ్మెల్యే నోముల భగత్, కోదాడలో ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి భార్య పద్మావతితో మరో సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పోటీ పడుతున్నారు. ఎంపీ కోమటి రెడ్డి పోటీ చేస్తున్న నల్గొండలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పిల్ల రామరాజు యాదవ్, బీజేపీ నుంచి గౌడ సామాజిక వర్గానికి చెందిన మాదగాని శ్రీనివాస్ గౌడ్ బరిలో దిగారు. సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌పై బీఎస్పీ నుంచి వట్టె జానయ్య యాదవ్, ఆలేరులో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డిపై బీజేపీ నుంచి మున్నూరుకాపు వర్గానికి చెందిన పడాల శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి యాదవ వర్గానికి చెందిన బీర్ల ఐలయ్య పోటీకి దిగారు. బీసీ అభ్యర్థుల పోటీ కారణంగా ఆ వర్గం ఓట్లు చీలే అవకాశం ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. ఐదు నియోజకవర్గాల్లో యాదవ, గౌడ సామాజిక వర్గంతో పాటు మున్నూరు కాపు ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దీంతో ఈ ప్రభావం ఎవరి పైన పడుతుందో తెలుసుకునేందుకు ఆయా పార్టీలు సర్వేలు చేయిస్తున్నాయి. ఏవర్గం ఓటర్లు ఎవరి వైపు మొగ్గుచూపుతున్నారు.. అసలు బీసీ అభ్యర్థుల పోటీ పైన ప్రజల స్పందన ఎలా ఉంటుందన్న ఆసక్తి నెలకొంది. అగ్రనేతలకు ధీటుగా బీసీ క్యాండిడేట్లు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించడంతో పాటు ప్రచార రథాలు, బైక్ ర్యాలీలతో హోరెత్తిస్తున్నారు.సామాజిక మాధ్యమాల్లో అన్ని వర్గాల ప్రజలను ఆ కట్టుకునేవిధంగా పోస్టులతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నల్గొండ, ఆలేరులో అభ్యర్థులు పల్లె నిద్ర కూడా చేస్తున్నారు.

ఆయా గ్రామాల్లో తమ పర్యటన అనంతరం ప్రజల్లో జరుగుతున్న చర్చ గురించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు.

# రాహుల్‌కు వ్యవసాయం తెలుసా!

(మొదటిపేజీ తరువాయి)



అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం గత పదేండ్ల నుంచి ప్రశాంతంగా ఉంది. ఈ 100 ఏండ్లలో ఈ పదేండ్లే తెలంగాణ ప్రశాంతంగా ఉన్నది. కర్ఫ్యూ లేదు.. పంచాయితీ లేదు.. లొల్లి లేదు. మంచిగా ఉన్నది.. అందరం కలిసిమెలిసి బతుకుతున్నాం. అదే కాంగ్రెస్ ఉన్నప్పుడు తెల్లారితే కర్ఫ్యూ, మతకల్లోలాలు, ఆ పంచాయితీలన్నీ ఎవరు పెట్టారో ఆలోచించాలి. ఓటు అనేది ముఖ్యం. పాలిటిక్స్ కూడా చాలా ముఖ్యం. రాయి ఏందో.. రత్నం ఏందో గుర్తు పట్టాలి. పార్టీల వైఖరి కూడా చాలా ముఖ్యం అని కేసీఆర్ అన్నారు. 'ఎవరికిపడితే వాళ్లకు ఓటేయొద్దు. ఆగం కావద్దు. ధరణిని తీసేస్తే మళ్లీ పాత రోజులే వస్తయ్. దళారీ రాజ్యమే అయితది. రిజిస్ట్రేషన్ల కోసం నానా తిప్పలు అయితయ్. వెనుకటి లెక్కనే మీ భూమి మీద ప్రభుత్వంలో ఉన్న అధికారులకు పెత్తనం వస్తది. వాళ్లు తల్చుకుంటే ఎవరి భూమిని ఎవరి పేరు మీదకైనా మార్చే పరిస్థితులు మళ్లీ వస్తయ్. కానీ ధరణి ఉంటే.. ముఖ్యమంత్రి కూడా మీ భూమిని ఇంకొకరి పేరు మీదకు మార్చలేడు. మరి కాంగ్రెస్ పార్టీ ధరణి తీసేయాలనుడు కరెక్టేనా..? దీనిపై మీరు గ్రామాల్లో చర్చ పెట్టాలె. రాహుల్‌గాంధీ కూడా ధరణిని తీసేయాలంటున్నడు ఎట్ల కథ అని ఆలోచన చేయాలె. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏమైతదనేది మీ ఊర్లళ్ల తెల్వనోళ్లకు మీరే అర్థమైతట్లు చెప్పాలె. ప్రజల మేలు కోరే పార్టీకే ఓటేయాలి. అప్పుడు మీ బతుకులు బాగుంటయ్. రాష్ట్రం ఇంకింత బాగుపడుతది' అని కేసీఆర్ అన్నారు. పేదల సంక్షేమం ఎవరైనా ఆలోచించారా? పేదింటి పిల్ల పెళ్లికి లక్ష రూపాలు ఇవ్వాలని ఏ ప్రభుత్వమన్న ఆలోచించిందా? అంటూ సీఎం కేసీఆర్ ప్రశ్నించారు.'పేదల సంక్షేమం ఆలోచించారా? ఎన్నడన్న ఎవడన్నా పేదల పిల్లల పెళ్లయితే ఓ లక్ష రూపాలు ఇవ్వాలని ఏ ప్రభుత్వమైనా ఆలోచించిందా? వాళ్ల మైండుకన్నా తట్టిందా? పేదవాళ్లు ఉంటే వాళ్ల కండ్లు చూపించాలి.. కళ్ల అద్దాలు ఇవ్వాలి.. కంటి వెలుగు ప్రోగ్రామ్ పెట్టాలని ఓ గవర్నమెంటన్నా ఆలోచించిందా ? ఆడ పిల్లలు ప్రసూతికి పోతే.. డాక్టర్లు అడ్డమైన దోపిడీ చేస్తే.. కేసీఆర్ కిట్టు పెట్టి గవర్నమెంట్ దాఖాలను బలోపేతం చేశాం. ఏవిధంగా 13లక్షల కుటుంబాలకు కల్యాణలక్ష్మి వచ్చిందో మీకు తెలుసునన్నారు.ఏ విధంగా పేదలను ఆదుకుంటున్నామో తెలుసు. చేనేత కార్మికుల కోసం బతుకమ్మ చీరలను తీసుకువచ్చాం. అవి పీతాంబరాలు కాకపోవచ్చు. అటు కార్మికులకు బతుకుతున్నరు. ఇటు పేదసాదలకు ఓ చీర దొరుకుతున్నది. రెండు ప్రయోజనాలు నెరవేరుతున్నాయ్. ఇలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. విద్య విషయంలో ఇవాళ రెసిడెన్షియల్ కళాశాలలు వచ్చాయ్. పెద్దపల్లిలో కూడా చాలా ఉన్నయ్. ఎంతబాగున్నయ్ కాలేజీలు. అందరికీ పెట్టుకున్నాం. గిరిజనులకు, మైనారిటీలకు, బీసీలకు పెట్టినాం, ఎస్సీలకు పెట్టినాం. ఈ మధ్య నాపై ఒత్తిడి వచ్చింది. ఓసీలం మేం కూడా ఉన్నం. మాదాంట్లో పేదలున్నారు మాకు కాలేజీలు వద్దా అని అడిగారు. అందుకే మొన్న నియోజకవర్గానికో ఒకటి చొప్పున 119 ఓసీల కోసం రెసిడెన్షియల్ స్కూల్స్ పెడతామని ప్రకటించాం. ఎవరు పేదలైతే వారికి న్యాయం జరగాలి. ఎంత బ్రహ్మాండమైన విద్య దొరుకుతుంది విద్యార్థులకు. మరి ఈ రెసిడెన్షియల్ పాఠశాలలను వాళ్లు ఎందుకు పెట్టలేదో ఆలోచించాలి' అన్నారు. ఈ రోజు బస్తీ దవాఖాలు, పల్లె దవాఖానాలు, అమ్మ ఒడి వాహనాలు, కేసీఆర్ కిట్ ఇవన్నీ సామాజిక బాధ్యతతో, సామాన్య, నిరుపేద ప్రజలకు అవసరమైన స్కీమ్స్ తీసుకువచ్చాం. గతంలో ఇవన్నీ ఎందుకు ఆలోచన చేయలేదు అని అడుగుతున్న. ప్రజలు కూడా ఆలోచన చేయాలి. మేం మేనిఫెస్టోలో చెప్పినయ్ తక్కువ.. పెట్టకుండా చేసినయ్ ఎక్కువ. చాంతాడంత లిస్టున్నది. పేద పిల్లలకు సీటు వస్తే రూ.20లక్షల గ్రాంట్ ఇచ్చి విదేశాలకు ప్రభుత్వం ఉండెనా ? జ్యోతిబా పూలే మీద, అంబేద్కర్, ఇతరుల పేర్లను పెట్టి సాయం అందిస్తున్నాం. ఇవాళ జిల్లాకో మెడికల్ కాలేజీ మనం అనుకున్నమా జీవితంల. అసలు పెద్దపల్లి జిల్లా అయితుండే కేసీఆర్ ముఖ్యమంత్రి కాకపోతే.. తెలంగాణ రాకపోతే. మనోహర్‌రెడ్డే ఎమ్మెల్యే లేకపోతే పెద్దపల్లి జిల్లా వచ్చేదా? పెద్దపల్లి జిల్లా తెచ్చినందుకైనా లక్ష మెజారిటీతోని మనోహర్‌రెడ్డిని గెలిపించాలి. ఓ గ్రోత్ సెంటర్ రావాలి కరీంనగర్-మంచిర్యాల మధ్యన అని నేను ఆలోచిస్తుంటే.. పెద్దపల్లిలో పెట్టండంటూ నా వద్ద కూర్చొని పెద్దపల్లిని జిల్లా చేయించిందే మనోహర్‌రెడ్డి' అంటూ సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న మనోహర్ రెడ్డి విద్యావేత్త. ఎమ్మెల్యే అయ్యాడు. నిస్వార్థంగా పని చేస్తడు. స్వార్థం లేదు. ఈ పదేండ్లలో ఒక్క రోజు కూడా వ్యక్తిగత పనుల గురించి అడగలేదు. పెద్దపల్లి పనులు.. మా ఆయకట్టుకు నీళ్లు వస్తలేవు. మీద మోటార్లు పెడుతున్నారని నాకు చెప్పేవారు. ఇంకేదన్న చేయాలి ఓదెల శ్రీరాంపూర్‌కు నీల్లు పోవాలని అడిగారు. రైతుల గురించి తపన పడిండు. పదేండ్ల కిందనే రూ. 40 లక్షలు ఖర్చు పెట్టి ప్రతి ఊరికి చెట్లు పంపిణీ చేసిండు. నియోజకవర్గం బాగుపడాలని ఆలోచిస్తడు. ఆయనకు డ్రామాలు, నాటకాలు వేసుడు రాదు. ఉన్నది ఉన్నట్టు మాట్లాడుతాడు. అరమరికలు లేకుండా నిజాయితీగా ఉంటడు. దొంగ ధర్నాలు, దొంగ దీక్షలు చేసుడు ఆయనకు రాదు. సాదాసీదాగా మీ మధ్య ఉండే వ్యక్తి. మీ కోసం పని చేసే వ్యక్తి. లక్ష ఓట్ల మెజార్టీతో మనోహర్ రెడ్డిని గెలిపించాలని కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# డబ్బు, కమీషన్ల కోసమే మేడిగడ్డ ప్రాజెక్టును కట్టారు

(మొదటిపేజీ తరువాయి)



జ్యూడీషియరి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని కోదండరాం డిమాండ్ చేశారు. తెలంగాణలో బీఅర్ఎస్ నిరంకుశ పాలన అంతం కావడానికి తెలంగాణ జన సమితి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం జరిగిందని కోదండరాం తెలిపారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న క్రమంలో ఆ పార్టీకి తమ తరఫున 6 ప్రతిపాదనలు ప్రతిపాదించామని అన్నారు. అందుకు ఆ పార్టీ ఒప్పుకుందని చెప్పారు. విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వాలిఉపాధి ఉద్యోగ కల్పన జరగాలి. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారం కొత్త ఉద్యోగాలు ఇవ్వాలి.చిన్న సూక్ష్మ కుటీర పరిశ్రమలకు తోడ్పాటు అందించాలి.కౌలు రైతులకు ఆదాయ భద్రత కల్పించాలి.రాజ్యాంగం ప్రకారం పాలన జరగాలి.ఉద్యమ కారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ఈ అరు ప్రతిపాదనలు ప్రతిపాదించగా కాంగ్రెస్ అధిష్ఠానం ఒప్పుకుందని కోదండరాం తెలిపారు. తెలంగాణలో ఈ పాలన అంతం కావడానికి ప్రజలు చైతన్యం కావాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డపై వాస్తవ సమాచారం ప్రభుత్వం ఇంకా కమిటీకి ఇవ్వలేదని.. కేసీఆర్ పాలన కాళేశ్వరం ప్రాజెక్ట్ చూస్తే తెలుస్తుందన్నారు. కాగా కొన్ని రోజుల క్రితం కాళేశ్వరం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ వంతెన కొంతమేర కుంగిపోవడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. దీంతో మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి పనులు, మరమ్మతులపై ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు దృష్టి సారించారు. బ్యారేజీలోని దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులకు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే కాళేశ్వరం జలశాయంలోని అన్ని బ్యారేజిలు ఖాళీ అయ్యాయి. బ్యారేజిలో నీటి నిల్వ తగ్గింపు చేసిన అధికారులు.. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటిని ఏడో బ్లాక్?కు తాకకుండా మళ్లింపు చేస్తున్నారు. పై నుంచి 26వేల500 క్యూసెక్కుల ప్రవాహం రాగా.. 57గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. 10 రోజులుగా గేట్లను ఎత్తివేస్తున్న అధికారులు.. దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇటీవల బ్యారేజీకి సంబంధించి రెండు పియర్ల వద్ద బుంగలు ఏర్పడడంతో అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు.. తాత్కాలికంగా కట్టడి చేశారు. కొన్ని రోజుల నుంచి 10, 8, 7 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండగా ఆదివారం సాయంత్రం ఒక్క గేటుకు పరిమితం చేశారు. దీంతో దిగువకు స్వల్పంగా ప్రవాహం వెళ్లింది. కొన్ని రోజుల క్రితం కాళేశ్వరం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ వంతెన కొంతమేర కుంగిపోవడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. శనివారం రోజు సాయంత్రం భారీ శబ్దంతో బీ-బ్లాకులోని 18, 19, 20, 21 పిల్లర్ల మధ్య వంతెన ఒక అడుగు మేర కుంగిపోయింది. బ్యారేజీ 20వ పిల్లర్ కుంగడంతోనే పైన వంతెన కూడా కుంగి పోయింది.బ్యారేజీ పొడవు 1.6 కిలో మీటర్లు ఉండగా కుంగిన ప్రాంతం మహారాష్ట్రవైపు నుంచి 356 మీటర్ల సమీపంలో ఉంది. నీటి పారుదల శాఖ ఇంజినీర్లు డ్యామ్ పరిసరాల్లో అలర్ట్ ప్రకటించి. మహారాష్ట్ర-తెలంగాణ రాష్ట్రాల మధ్య బ్యారేజీపై రాకపోకలు నిలిపివేశారు. ఒకవైపు మేడిగడ్డ వివాదం ముగియక ముందే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన అన్నారం(సరస్వతి) బ్యారేజీ దిగువన సీపేజీ(బుంగలు) రావడం అధికారులను ఆందోళనకు గురి చేసింది. ఈ నేపథ్యంలోనే బ్యారేజీకి సంబంధించి బ్లాక్ బి-4లోని 38, 42 పియర్‌ల వద్ద వెంట్ ప్రదేశాలలో సీపేజీ(బుంగలు) రావటం మొదలయ్యాయి. రెండు చోట్ల బుంగలు ఎక్కువగా ఉండటంతో ఇంజినీర్లు తగిన చర్యలు చేపట్టారు. వాటిని అరికట్టేందుకు ముందు జాగ్రత్త చర్యగా రింగ్‌బండ్ వేశారు. దీంతో అధికారులు రెండు చోట్ల రెండు మూడు అంగుళాల మేర సీపేజీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఇసుక తేలకపోవడంతో ప్రమాదం లేదని వారు వివరించారు. పడవల ద్వారా సీపేజీ ఏర్పడిన ప్రాంతాలకు చేరుకొని ఇసుక సంచులతో, బండ రాళ్లతో అడ్డుకట్ట వేశారు. సుమారుగా 2,000 బస్తాలను బుంగలపై వేసిన ఇంకా పరిస్థితి అదుపులోకి రాలేదు.

## చంద్రబాబు కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ పూర్తి

### 45 నిమిషాల్లో ఆపరేషన్‌ను పూర్తిచేసిన వైద్యులు

**అమరావతి,నవంబరు7 :** ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్స పూర్తయింది. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు ఆయనకు విజయవంతంగా కాటరాక్ట్ ఆపరేషన్‌ను నిర్వహించారు. చంద్రబాబుకు 45 నిమిషాల్లో కాటరాక్ట్ ఆపరేషన్‌ను వైద్యులు పూర్తి చేశారు. ఆపరేషన్ ముగిసిన వెంటనే ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి బయలుదేరారు. మరో వారం రోజుల పాటు చంద్రబాబు విశ్రాంతి తీసుకోనున్నారు. మరోవైపు చంద్రబాబును చూసేందుకు పెద్ద సంఖ్యలో టీడీపీ అభిమానులు ఆసుపత్రికి వచ్చారు. చంద్రబాబు కంటి ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల టీడీపీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన చంద్రబాబు 50 రోజులకు పైగా రాజమండ్రి జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో కంటికి ఆపరేషన్ నేపథ్యంలో షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. టీడీపీ-జనసేన పార్టీలు పొత్తు ప్రకటన తర్వాత ఉమ్మడి కార్యాచరణ దిశగా ముందుకు కదులుతున్నాయి. ఇప్పటికే రెండు పార్టీల నుంచి ఉమ్మడి కమిటీల నియామకం జరిగింది. వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా ముందుకెళ్తామని రెండు పార్టీలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## సకల జనుల సమరంతోనే తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి ఉందని అన్నారు. ప్రధాని మోదీ ఎన్నికల ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటే ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్ లాంటివి కీలక నిర్ణయాలు తీసుకునేవారు కాదని అన్నారు. రామమందిరం నిర్మించగలిగేవారు కాదని అన్నారు. దేశ ప్రయోజనాలే మోదీని నిర్దేశిస్తాయి కానీ, ఎన్నికల ప్రయోజనాలు కాదని అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బీజేపీ భారీ బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఈ సభకు ప్రధాని మోదీ కూడా హాజరు కాగా, ఆయనపై ప్రశంసలు కురిపించారు. మోదీ అధికారంలోకి వచ్చాకే ఉగ్రదాడులు నియంత్రించ గలిగారని అన్నారు. ప్రతి భారతీయుడి గుండెల్లో ప్రధాని మోదీ ధైర్యం నింపారని కొనియాడారు. దేశంలో ఉన్న అత్యధిక జనాభా బీసీలు. మోదీ ప్రభుత్వం బీసీలను నోటితో చెప్పి ప్రేమించలేదని, సీటుతో ఇచ్చి ప్రేమించిందని అన్నారు. మాటలతో కాకుండా, బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి ప్రేమించిందని అన్నారు. ప్రధాని మోదీ ఎప్పుడూ దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తారు తప్ప.. ఎన్నికల ప్రయోజనాల కోసం కాదు. మోదీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తే ఆర్టికల్ 370, నోట్ల రద్దు చేసేవారు కాదు. తెలంగాణ సాధించినా నీళ్లు, నిధులు, నియామకాలు అందని పరిస్థితి. మోదీ నాయత్వంలో బీసీల తెలంగాణ రావాలి. నాలాంటి కోట్ల మంది కలలకు ప్రతిరూపమే నరేంద్ర మోదీ. నరేంద్ర మోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. భారతదేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 దేశంగా తీర్చిదిద్దగలిగే సత్తా ఉన్న నాయకుడు మోదీ' అని పవన్ కల్యాణ్ అన్నారు. 'భాగవతం పుట్టిన నేల ఇది. ఈ నేలలో బతుకు భారం అవ్వకూడదు. మోదీ నాయకత్వంలో బీసీలు తెలంగాణలో ఎదగాలి. బీసీలు ముఖ్యమంత్రి కావాలి. మూడోసారి మోదీ సర్కార్ రావాలి. ఈ ఎన్ని కల కోసం ప్రధాన మంత్రికి నేను అండగా ఉంటా ను. తమ పార్టీతో కలిసి పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చినందుకు తెలంగాణ బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, కె.లక్ష్మణ్, బండి సంజయ్ కు ధన్యవాదాలు.

# చిన్నాచితక పార్టీలు ప్రభావం చూపేనా?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ ఎవరు ఎటువైపో అన్నది మెల్లగా స్పష్టం అవుతోంది. అయితే విజయం ఎవరిదన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేకున్నా..అందరినీ ఆనందోడిలికల్లో ముంచేస్తోంది. ఎన్నికల ముందు సర్వసాధారణంగా అటువారు ఇటు..ఇటువారు అటు మారిపోతుంటారు. ఈ ఎన్నికల ముందు కూడా అలాంటి చిత్రాలు ఎన్నో చూశాం. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లను నమ్ముకుని ఎందరో వచ్చి చేరారు. విచిత్రమేమంటే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కాంగ్రెస్‌లో కొందరికి టిక్కెట్లు దక్కాయి. కానీ బిఆర్ఎస్‌లో చేరినవారంతా కేవలం కక్షతో చేరిన వారే. వారికి ఎక్కడా ఒక్క టిక్కెట్ కూడా దక్కలేదు. వీరంతా రేపటి ఎన్నికల్లో ఎంతమేరకు ప్రభావం చూపుతారాన్నది చూడాలి. ఇకపోతే కమ్యూనిస్టులు ఏ ఎండకాగొడుగు పట్టే తత్వాన్ని పట్టుకున్నారు. గతంలో మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కెసిఆర్‌ను ఇంద్రుడు,చంద్రుడు అని పొగిడిన వారే ఇప్పుడు కెసిఆర్‌ను తిడుతూ.. కాంగ్రెస్ విదిల్చే ఒకటి రెండుసీట్ల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వీరు ఎక్కడా గెలవకున్నా కొన్నిచోట్ల ఓటమికి మాత్రం దోహదపడడం ఖాయం. ఇకపోతే అధికార పార్టీని ఎండగడుతూ వచ్చిన షర్మిల చివరకు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించడం ద్వారా కొంతయినా వారికి అండగా నిలిచారు. తాను నిలబడితే చీలిక ఓట్లతో బిఆర్ఎస్ లాభిస్తుందని ఆమె గుర్తించారు. అందుకే చేసేదేమీ లేకపోవడంతో పాటు..చేతులు కాల్చుకోవడం ఇష్టం లేక ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారని భావించాల్సిందే. ఇకపోతే తెలంగాణలో బిఎస్పీకి ఊతంగా నిలిచిన ఐపిఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ ఏ మేత్రకు ప్రభావం చూపుతారన్నది చూడాలి. ఈ క్రమంలో ఎన్నికల్లో చిన్న పార్టీలన్నీ తలో దిక్కు చేరిపోతున్నాయి. అయితే పొత్తులు లేకపోతే పోటీ నుంచి విరమించుకోవడం వంటివి చేస్తున్నాయి. కానీ బహుజనసమాజ్ పార్టీ మాత్రం ఆ దిశగా ఆలోచించలేదు. ఒంటరిగా పోటీ చేస్తోంది. కనీసం వంద స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే మూడు జాబితాల ద్వారా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అభ్యర్థుల్ని ఖరారు చేశారు. అందరి దృష్టిని ఆకర్షించేలా ఓ ట్రాన్స్ జెండర్‌కూ టిక్కెట్ కేటాయించారు. మరో వైపు తాను స్వయంగా జనరల్ సీటులో పోటీకి దిగారు. సిర్పూర్ నుంచి తాడోపేడో తేల్చుకుంటానంటున్నారు. దీంతో ఎన్నికల్లో బీఎస్పీ ప్రభావం ఎంత ఉంటుందన్నదానిపై రాజకీయవర్గాల్లో భిన్నమైన చర్చలు నడుస్తున్నాయి. కులాల కుంపట్లలో కొట్టుకుపోతున్న ప్రజలు గంప గుత్తగా బిఎస్పీకి అధికారం అప్పగిస్తారని అనుకోవాడనికి లేదు. అలా అయితే ఎస్సీ,బిసీలంతా బిఎస్పీకి అండగా నిలవాల్సిందే. కానీ అలా జరగదని గతంలో అనేక ఎన్నికల అనభువాలు చెబుతు న్నాయి. తెలంగాణలో బహుజన్ సమాజ్ పార్టీ ఉనికి గతంలో పెద్దగా ఉండేది కాదు. ఏదైనా పార్టీలో టిక్కెట్లు దొరకని నేతలు బీఎస్పీ బీఫాం తెచ్చుకుని పోటీ చేసి తమ సత్తా చాటేవారు. 2014లో బీఎస్పీకి ఆదిలాబాద్ జిల్లాలో రెండు సీట్లు వచ్చాయి. ఇంద్రకరణ్ రెడ్డితో పాటు కోనేరు కోనప్ప బీఎస్పీ సీట్లపై గెలిచారు. కానీ వారు కేవలం బీఫాం కోసమే ఆ పార్టీలో చేరారు. ఓ రకంగా ఇండిపెండెంట్లుగా గెలిచారు. తర్వాత వారు బీఆర్ఎస్ లో చేరారు. అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఇప్పుడు మరోసారి పోటీ చేస్తున్నారు. ఆ పార్టీకి స్థిరమైన నాయకత్వం లేదు. జాతీయ అధ్యక్షురాలు మాయవతి కూడా ఎప్పుడూ తెలంగాణపై పెద్దగా దృష్టి పెట్టలేదు. కానీ ఐపీఎస్‌గా పదవీవిరమణ తీసుకున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఎస్పీలో చేరి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆ పార్టీని బలో పేతం చేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ప్రవీణ్ కుమార్ సాదాసీదా ఐపీఎస్ కాదు. ఆయన ఐపీఎస్ అయినా.. పోస్టింగ్ మాత్రం సాంఘిక సంక్షేమ శాఖలో తీసుకున్నారు. తెలంగాణలోని గురుకుల పాఠశాలవ్యవహారాలను తొమ్మిదేళ్ల పాటు తన కనుసన్నల్లో ఉండేలా చూసుకున్నారు. ' స్వేరోస్' అనే సంస్థను పాతుకుపోయేలా చేయగలిగారు. సోషల్ వెల్ఫేర్ ఏరోస్ ను స్వేరోస్‌గా పిలుస్తారు. ఈ సంస్థను ప్రవీణ్ కుమార్ ప్రారంభించ లేదు. కానీ ఈ సంస్థకు వెన్నుముకగా ఆయన నిలిచారు. ప్రవీణ్ కుమార్ హయాంలో గురుకల హాస్టళ్లలో స్వేరోస్ విస్తృతంగా విస్తరించారు. మెల్లగా స్వేరో భావాజాలను దళిత కాలనీలకు విస్తరించారు. స్వేరోస్ భావజాలం.. చాప కింద నీరులా విస్తరించింది. ఇప్పుడు వీరినే ప్రవీణ్ కుమార్ తన బలంగా భావిస్తున్నారు. దళిత భావజాలాన్ని అందుకే విస్తృతంగా వినిపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జనాభాలో 17.5 శాతం. వీరు రాజకీయ పార్టీల భవితవ్యాన్ని మార్చేయగలరు. ఆ విషయం రాజకీయ పార్టీలకు తెలుసు కాబట్టే.. రాజకీయ పార్టీలన్నీ దళితవాదం అందుకున్నారు. అయితే.. దళితుల్లో సహజంగానే తమను పైకి రానివ్వడం లేదన్న అసంతృప్తి ఉంది. ఆ అసంతృప్తి నుంచి ఇప్పటి వరకూ ఒక్క సరైన నాయకుడు పుట్టుకురాలేదు. ఇప్పుడు తాను ఆ బాధ్యత తీసుకుంటానని.. వారికి నాయకుడిగా ఎదగాలని ప్రవీణ్ కుమార్ ప్రయత్నిస్తున్నారు. ఆయన ఎంత ప్రభావం చూపిస్తుందన్నది అంచనా వేయడం కష్టంగా మారింది. రిజర్వ్ నియోజకవర్గంలో పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ బీఎస్పీ చీఫ్ ప్రవీణ్ కుమార్ జనరల్ సీటు అయిన సిర్పూల్‌లో పోటీ చేస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, బీసీలు, మైనారిటీల పక్షాన గళం విప్పుతున్నా.. వారు ఏ మేరకు బిఎస్పీకి అండగా ఉంటారన్నది కూడా అనుమానమే. అసైన్డ్ భూములను అభివృద్ధి పనుల పేరిట ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడం, పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపక పోవడంతో పాటు నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయంపైనా ప్రశ్నిస్తున్నారు. పోరాట పటిమ ద్వారా ఓ బలమైన నాయకుడిగా ఎదిగే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు అవకాశం వచ్చినా పట్టించుకోలేదు. దళిత వర్గాలను ఏకం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ ఓట్లు పొందితే ఎవరు నష్టపోతారన్న సంగతి పక్కన పెడితే.. ప్రవీణ్ కుమార్ తెలంగాణ రాజకీయాల్లో ఏ మేరకు ప్రయత్నిస్తా రన్నది చూడాలి. ఇలా రాజకీయ పార్టీలు ఎవరికి వారు సొంత నిర్ణయాలు తీసుకుంటే చివరకు ఏ పార్టీ లాభం పొందుతుందన్నదే ప్రశ్న.


# భారత దేశం గర్వించదగ్గ ఆంగ్ల రచయిత రాజారావు

**నవంబర్ 8... రాజారావు జయంతి**



**(రామ కిష్టయ్య సంగన భట్ల)**
**94405 95494**

**20వ** శతాబ్దపు ఆంగ్లంలో వ్రాసిన అత్యంత ముఖ్యమైన భారతీయ నవలా రచయితలలో రాజారావు ఒకరు. భారత దేశం గర్వించదగ్గ ఆంగ్ల రచయిత రాజారావు (1908-2006) ఇంగ్లీషులో నవలలు, కథలు వ్రాసి, ప్రపంచ గుర్తింపు పొందాడు. రాజారావు 1908, నవంబరు 8వ తేదీన మైసూరు రాజ్యం (ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం) లోని హసన్ పట్టణంలో ఒక స్మార్త బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇతడు వారి తల్లి దండ్రులకు జన్మించిన 9 మంది సంతానంలో పెద్దవాడు. ఇతనికి ఏడుగురు చెల్లెల్లు, ఒక తమ్ముడు యోగేశ్వరానంద ఉన్నారు. ఇతని తండ్రి హెచ్.వి.కృష్ణస్వామి హైదరాబాదు లోని నిజాం కళాశాలలో కన్నడ భాషను బోధించేవాడు. ఇతని తల్లి గౌరమ్మ ఒక గృహిణి. ఇతడు 4 యేళ్ల వయసులో ఉన్నప్పుడు ఆమె మరణించింది.ఇతడు నైజాం పరిపాలనలో ఉన్న ఆనాటి హైదరాబాదులోని మదరసా - ఎ - ఆలియాలో మెట్రిక్యులేషన్ వరకూ చదివాడు. తరువాత తండ్రి పనిచేస్తున్న నిజాం కళాశాలలో డిగ్రీ చదివాడు. తరువాత ఇతడు అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలో ఫ్రెంచి అధ్యయనం చేశాడు. ఆ తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు, చరిత్రలలో పట్టా పుచ్చుకున్నాడు. హైదరాబాదు రాష్ట్ర ప్రభుత్వంచేత 1929లో ఏషియాటిక్ స్కాలర్‌షిప్ పొంది ఫ్రాన్స్‌లోని



మొపెయి విశ్వ విద్యాలయం (ఖఅఅజవతీంఔఎ శీట వీశీఔజూవశ్రీశ్రీఅవతీ)లో ఐరిష్ సాహిత్యంపై భారతీయ ప్రభావం అనే అంశంపై అధ్యయనం చేశాడు. 1931లో ఇతడు కేమిల్ మౌలీ అనే ఫ్రెంచి అధ్యాపకురాలిని వివాహం చేసుకున్నాడు. 1939 వరకు వీరు కలిసి ఉన్నారు. తరువాత వీరి సంబంధం భగ్నమైంది. ఈ వైవాహిక జీవితం గురించి రాజారావు తన నవల "ది సెర్పెంట్ అండ్ ది రోప్"లో వర్ణించాడు. 1939లో ఇతడు భారతదేశం తిరిగి వచ్చాడు. 1942లో ఇతడు క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. 1943-1944లో ఇతడు బొంబాయి నుండి వెలువడిన "టుమారో" అనే పత్రికకు సహ సంపాదకుడిగా వ్యవహరించాడు. "శ్రీ విద్యా సమితి" అనే సాంస్కృతిక సంస్థ ప్రారంభానికి ఇతడు ముఖ్య కారకుడు. ఇతడు "చేతన" అనే మరో సాంస్కృతిక సంస్థతో కూడా అనుబంధాన్ని కలిగి ఉన్నాడు. ఇతడు 1966 నుండి 1986 వరకు ఆస్టిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో తత్వశాస్త్రాన్ని బోధించాడు. అక్కడ ఇతడు బోధించిన వాటిలో మార్క్సిజం నుండి గాంధీయిజం దాకా, మహాయాన బౌద్ధము, భారతీయ తత్త్వము, ఉపనిషత్తులు మొదలైనవి ఉన్నాయి. 1965లో ఇతడు అమెరికన్ రంగస్థల నటి కేథరిన్ జోన్స్‌ను వివాహం చేసుకున్నాడు. వారికి క్రిస్టఫర్ రామారావు అనే ఒక కుమారుడు కలిగాడు. 1986లో ఆమెకు విడాకులు ఇచ్చి సూసన్ వాట్‌ను మూడవ వివాహం చేసుకున్నాడు. సూసన్ 1970లో టెక్సాస్ యూనివర్సిటీలో ఇతని శిష్యురాలు.ఇతడు తన రచనా వ్యాసంగంపు తొలిదశలో ఫ్రాన్సు దేశంలో ఫ్రెంచి, ఇంగ్లీషు, కన్నడ భాషలలో కథలు వ్రాశాడు. 1939లో ఛేంజింగ్ ఇండియా అనే సంకలనానికి సంపాదకునిగా, విదర్ ఇండియా అనే పుస్తకాన్ని ఇక్బాల్ సింగ్‌తో కలిసి సహ సంపాదకునిగా ప్రచురించాడు. జవహర్‌లాల్ నెహ్రూ వ్రాసిన సోవియట్ రష్యా సమ్ రాండమ్ స్కెచెస్ అండ్ ఇంప్రెషన్స్ అనే పుస్తకానికి సంపాదకుడిగా ఉన్నాడు. ఇతడు జాతీయోద్యమంలో పాల్గొన్న అనుభవాలు ఇతని తొలి నవల "కాంతాపుర"లోను కథా సంకలనం "ది కౌ ఆఫ్ ది బ్యారికేడ్స్"లోను ప్రతిఫలించాయి. ఫ్రాన్స్ నుండి తిరిగి వచ్చిన చాలా కాలం తర్వాత 1960లో ఇతడు "ద సర్పెంట్ అండ్ ద రోప్" రచించాడు. దీనిలో భారతీయ పాశ్చాత్య సంస్కృతుల మధ్య సంబంధాలను నాటకీయ ఫక్కీలో వర్ణించబడింది. ఈ నవల పేరులోని సర్పం భ్రాంతికి, త్రాడు (=శీజూవ), వాస్తవానికి ప్రతీకలు. కాంతాపుర (1938), ద సర్పెంట్ అండ్ ద రోప్ (1960), ద క్యాట్ అండ్ షేక్స్‌పియర్: ఎ టేల్ ఆఫ్ ఇండియా (1965), కామ్రేడ్ కిరిలోవ్ (1976), ద చెస్ మాస్టర్ అండ్ హిజ్ మూవ్స్ (1988), ఆన్ ది గంగా ఘాట్ (1989), ద కౌ ఆఫ్ ది బ్యారికేడ్స్ (1947), ద పోలీస్‌మాన్ అండ్ ద రోజ్ (1978), ద ట్రూ స్టోరీ ఆఫ్ కనకపాల, ఇన్ ఖందేష్, కంపేనియన్స్, ద కౌ ఆఫ్ ది బ్యారికేడ్స్‌అక్కయ్య, ద లిటిల్ గ్రామ్ షాప్, జవని, నిమ్మ, ఇండియా ఎ ఫేబుల్, ద పోలీస్‌మాన్ అండ్ ద రోజ్‌బీ ఛేంజింగ్ ఇండియా: ఏన్ ఆంథాలజీ (1939)బీ టుమారో (1943-44), %విదర్ ఇండియా? (1948),ద మీనింగ్ ఆఫ్ ఇండియాబీ వ్యాసాలు (1996)బీ ద గ్రేట్ ఇండియన్ వే: ఎ లైఫ్ ఆఫ్ మహాత్మాగాంధీ, జీవిత చరిత్ర (1998), ద బెస్ట్ ఆఫ్ రాజారావ్ (1998), 5 ఇండియన్ మాస్టర్స్ (రాజారావు, రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రేమ్‌చంద్, డా. ముల్క్ రాజ్ ఆనంద్, కుష్వంత్ సింగ్) (2003) తదితర రచనలు చేశాడు.రాజారావు భారతదేశపు అత్యున్నత గౌరవాలు పొందాడు. 1964: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుబీ 1969: పద్మభూషణ్ పురస్కారంబీ 1988: న్యూస్టాడ్ట్ అంతర్జాతీయ సాహిత్య బహుమతిబీ 2007 లో మరణానంతరం పద్మ విభూషణ్ పురస్కారం లభించాయి. ఇతడు 2006, జూలై 8వ తేదీన టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్ నగరంలోని తన గృహంలో 97వ యేట గుండెపోటుతో మరణించాడు.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




**'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను** mantalukathalu@gmail.com **కు పంపవచ్చు...**

**-ఎడిటర్**

# రాజ ధర్మం



వజ్రగిరి రాజ్యాన్ని వజ్రసేనుడు అనే రాజు పరిపాలించేవాడు.ప్రజలను తన కన్న బిడ్డల వలె చూసుకునేవారు.ఆ రాజుకు వేట అంటే మహా సరదా!.అడవికి వెళ్ళి జంతువులను వేటాడి ఆనందించే వాడు.ఒక రోజు జంతువులను వేటాడటం కోసం అడవికి వెళ్ళాడు.రాజు మృగాలను తరుముతూ చాలా దూరం వెళ్ళి,అడవిలో దారి తప్పాడు.ఇంతలో చీకటి పడింది.ఆ రోజు రాత్రి రాజు ఒక పెద్ద చెట్టు పైకి ఎక్కి నిద్ర పోవడానికి ఉపక్రమించారు.ఇంతలో చెట్టు కింద కొన్ని జంతువుల మాటలు వినిపించాయి.అవి మానవ భాషలో మాట్లాడటం మొదలు పెట్టాయి.రాజుకు వాటి మాటలు వినాలనే కుతూహలం కలిగింది. అందులో ఒక మృగం మన రాజు ధర్మప్రభువు.తమ ప్రజలను కన్న బిడ్డల వలె చూసుకుంటున్నాడు, కానీ అతని వేట వల్ల మనం పడుతున్న ఇబ్బందులను ఆలోచించడం లేదు అన్నది.మరొక జంతువు వేట పేరుతో మనల్ని చిత్రహింసలకు గురిచేస్తున్నాడు,మనం కూడా ఈ రాజ్యం లోనే నివశిస్తున్నాము.మన ప్రాణాలను కాపాడటం రాజ ధర్మం కదా అని వాపోయింది. ఈ మాటలు విన్న రాజు వజ్రసేనుడికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. తెల్లవారిన వెంటనే రాజు తన రాజ్యానికి తిరిగి వెళ్ళాడు.ఆ జంతువులు అన్న మాటలే అతని చెవుల్లో మారు మ్రోగుతున్నాయి.అడవిలోకి వెళ్ళి వచ్చిన రాజులో ఏదో మార్పును గ్రహించాడు, మంత్రి.ఒక రోజు మంత్రి అడవిలో ఏం జరిగిందో!చెప్పమని రాజును అడిగాడు.అక్కడ జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు మంత్రికి చెప్పారు రాజు.జంతువుల మాటల్లో ధర్మం ఉందని పలికాడు మంత్రి. రాజు వెంటనే ప్రజలందరిని సమావేశపరిచి,ఈ దినము నుంచి నాతో పాటు ఎవరూ వన్యప్రాణులను చంపకూడదని రాజు, రాజ శాసనం చేశారు. అప్పటి నుండి ప్రజలు జంతువుల వేట మానుకున్నారు.తిరిగి మరలా ఒక రోజు రాజు అడవికి వెళ్ళి, జంతువులు ఏమనుకుంటున్నాయో తెలుసుకోవాలనుకున్నాడు.రాత్రికి చెట్టెక్కి కూర్చున్నాడు.జంతువులన్నీ రాజు చేసిన పనిని పొగుడుతూ అభినందనలు తెలిపాయి.రాజు వాటి మాటలు విని ఎంతో ఆనందపడ్డాడు.

**దాసరి చంద్రమోహన్,**
**ఎన్ తిమ్మాపురం, గుంతకల్లు,**
**9177948813**

# ఉమ్మడి జిల్లాలో పట్టుకోసం బిఆర్ఎస్ యత్నం

- **ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి కెటిఆర్**
- **స్థానిక నేతలతో వరుస మీటింగ్‌లతో దిశానిర్దేశం**
- **పచారంలో దూసుకుపోయేలా నేతల వ్యూహం**



**నిజామాబాద్,నవంబర్7 :** ఉమ్మడి జిల్లాలో అన్ని సీట్లను కైవసం చేసుకోవడంపై బిఆర్ఎస్ దృష్టి సారించింది. కామరెడ్డిలో కెసిఆర్ పోటీకి దిగడంతో అన్ని సీట్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఓ వైపు కెటిఆర్, కవిత, మరోవైపు స్పీకర్ పోచారం, మంత్రి వేముల ప్రశాంతరెడ్డిలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రచారం ఊపందుకుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది నియోజకవర్గాల్లో భారాస విజయం సాధించింది. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన జాజాల సురేందర్ మారిన రాజకీయ పరిస్థితులతో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం తొమ్మిది స్థానాల్లో తిరిగి పాగా వేయాలనే ఉద్దేశంతో మంత్రి కేటీఆర్ రోజుకో నియోజకవర్గ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ సమాలోచన లు చేస్తున్నారు. నిఘావర్గాలతో పాటు ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సేకరించిన సమాచారాన్ని ముఖ్యనేతలకు వివరిస్తున్నారు. కామారెడ్డి భారాస సమన్వయ కమిటీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ప్రచార సరళిని తెలుసుకుంటున్నారు. జుక్కల్ నియోజకవర్గ ముఖ్యనేతలకు ఇంటింటి ప్రచారంపై దృష్టి కేంద్రీకరించాలని సూచించినట్లు తెలుస్తోంది. బాన్సువాడ నియోజకవర్గ నేతలకు సైతం పలు సూచనలు చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న నేపథ్యంలో మంత్రి కేటీఆర్ అంతా తానై వ్యవహరిస్తున్నారు. కార్యకర్తలు, నేతల మధ్య ఏర్పడిన విభేదాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నా రు. మాచారెడ్డి ఎంపీపీ, జడ్పీటీసీ వర్గాల మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించే బాధ్యతను తన భుజాన వేసుకున్నారు. సామాజికవర్గాల వారీగా నిర్వహిస్తున్న సమావేశా లకు వస్తున్న స్పందనను అడిగి తెలుసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల కన్వీనర్ లకు బ్లూటూత్ ఓటింగ్ మిషన్‌లను పంపిణీ చేసి వాటి వినియోగంపై హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వీటి ఆధారంగానే ఇంటింటి ప్రచారం చేపట్టాలని కార్యకర్తలకు సూచిస్తున్నారు. ఎల్లారెడ్డి నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన కేటీఆర్ నియోజకవర్గంలో తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని ఏకరువు పెట్టారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనులను తెలియజేశారు. సురేందర్ 2001 నుంచి తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన తీరును తెలియజేస్తూ రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. కామారెడ్డి నియోజకవర్గ భారాస ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టానని, ఎల్లారెడ్డి నియోజకవర్గ భారాస కార్యకర్తలకు అండగా నిలుస్తానని వెల్లడించారు. అభివృద్ధికి భరోసా కల్పిస్తూ కార్యకర్తల్లో జోష్ తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే గజ్వేల్‌లో కేసీఆర్ అనుచరుల భూదందాలు కామారెడ్డిలో కూడా మొదలవుతాయని ప్రచారం చేస్తున్నారు.ఇలాంటి విమర్శల ను మంత్రి కేటీఆర్ ఎలా ఎదుర్కొంటారనేది ప్రస్తుతం ఆసక్తి రేపుతోంది. నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణుల పనితీరు, ప్రజలనాడి ఎలా ఉందనే దానిపై మంత్రి కేటీఆర్ ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ భారాస నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని సమీక్షించడంతో పాటు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, నేతలు విభేదాలు వీడి కలిసికట్టుగా పనిచేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. ఈ క్రమంలో కరెంట్, రైతుబంధు, ధరణిలపై ప్రచారం సాగుతోంది. రైతుబంధు పథకాన్ని అపాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కి కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం ఇవ్వడం సరైంది కాదని మంత్రి వేమలు ప్రశాంతరెడ్డి అన్నారు. ఇది రైతుల నోట్లో మట్టికొట్టే పనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలని అపివేయాలనడం సిగ్గుచేటు. తెలంగాణ రాష్ట్రంలో లక్ష ఐదు వేల మంది రైతుల కుటుంబాలని రైతు బీమా పథకాన్ని ఇచ్చాం. కర్ణాటకలో ప్రజలకు ఇచ్చిన హామీలని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌కి ఓటు వేయవద్దని తెలంగాణలో ప్రచారం చేస్తున్నారు. చెప్పింది మాత్రమే చేయడమే కేసీఆర్ లక్ష్యం. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంది. రైతు వ్యతిరేకిగా కాంగ్రెస్ పార్టీ నడుస్తుంది, కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన వినతిపత్రం దుర్మర్గమైన చర్య. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు, రైతులు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి. కర్ణాటకలో ప్రజలని మోసం చేసినట్లు తెలంగాణ ప్రజలని మోసం చేయవద్దు. కామారెడ్డిలో వందలాది మంది బీఆర్ఎస్ పార్టీలో చేరాడం సంతోషంగా ఉంది. కాంగ్రెస్, బీజేపీ పార్టీ నాయకులకి కామారెడ్డిలో డిపాజిట్ కూడా రాదు. కామారెడ్డి నియోజకవర్గం ప్రజలు చాలా అదృష్టం చేసుకున్నారు. కామారెడ్డిలో కేసీఆర్ భారీ మెజార్టీతో గెలుస్తున్నాడని అన్నారు.

# బిఆర్ఎస్‌కు కీలకంగా మారిన గజ్వేల్

**ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్న హరీష్**

**గజ్వేల్,నవంబర్7 :** గజ్వెల్ నియోజకవర్గం ఇప్పుడు అందరి దీష్టిని ఆకర్శిస్తోంది. ఇక్కడి నుంచి కెసిఆర్‌పై పోటీకి మాజీమంత్రి, బిజెపి ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ రంగంలోకి దిగడంతో పోటీ రసవత్తరంగా మారింది. కెసిఆర్ ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో ఈటెల దీనిని బాగా ఉపయోగించుకుంటు న్నారు. మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా మంత్రి హరీశ్ రావు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా గజ్వెల్ ప్రచారంలో ఆయన బాగా దృష్టి పెట్టారు. సీఎం కేసీఆర్‌ని ఓడించడానికి జనం సిద్ధం అయ్యారన్నారు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రచారంలో చెబుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో పేదల నుంచి భూములు లాక్కుని ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్తుతున్నారని ప్రచారం ముమ్మరం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో వాళ్ల అడుగులకు మడుగులు ఒత్తిన వారికే సంక్షేమ పథకాలు ఇస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా గజ్వేల్ ఎన్నికలు జరగాలన్నారు. బెదిరింపులు, ప్రలోభాలు, డబ్బు సంచులు ఇస్తే హుజురాబాద్ లో జరిగిన సీనే రిపీట్ అవుతుందన్నారు. గజ్వేల్ ప్రజలు సీఎం కేసీఆర్ ని కసితో ఒడిస్తారన్నారు. పొరపాటున సీఎం కేసీఆర్ గెలిస్తే ఒంటిపై ఉన్న బట్టలు కూడా మిగలవని వ్యాఖ్యానించారు. సర్వేకి అందని ఫలితం గజ్వేల్ లో రాబోతుందని అంటున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాక.. నిరుద్యోగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరు మీద లాక్కున్న భూములకు ఇంతవరకు పరిహారం అందించలేదని ఈటల అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కంపెనీల కోసం పేదల భూములు లాక్కొన్ని కేసీఆర్ సర్కార్ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోంది. ప్రాజెక్టుల వద్ద టూరిజం పేరుతో మళ్లీ భూముల్ని లాక్కుంటున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే లాక్కున్న భూములన్నీ తిరిగి ఇచ్చేస్తాం. రైతుల నుంచి భూముల్ని లాక్కుని అందులో వారినే కూలీలుగా మారుస్తున్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తానని వారి కోసం కంపెనీలు ప్రారంభిస్తామని చెప్పి ఇప్పటివరకు పట్టించుకోలేదు. కేసీఆర్ ను మళ్లీ గెలిపిస్తే ప్రజల బతుకులు ఆగం అవుతాయని ఈటల హెచ్చరిస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఇకపోతే మెదక్ జిల్లాలో మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు మంత్రి హరీష్ రావు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా తనపై విమర్శలు చేసిన మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావును దృష్టిలో ఉంచుకుని మెదక్ స్థానంలో పద్మా దేవేందర్‌రెడ్డి గెలుపును సవాల్‌గా తీసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా కాంగ్రెస్‌కి చెందిన మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, అధికార ప్రతినిధి ఆంజనేయులు తదితర నాయకులను బీఆర్ఎస్‌లోకి రప్పించారు. బీఆర్ఎస్ నాయకులతో మండలాల వారీగా సర్వే చేయిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకుంటూ తదనుగుణంగా గెలుపు వ్యూహాలు రచిస్తున్నారు. నర్సాపూర్ సెగ్మెంట్‌లోసునీతారెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఆయన వర్గం నాయకులు అసంతృప్తికి గురవడంతో ఇరు వర్గాలను కూర్చోబెట్టి సమన్వయం కుదిర్చారు. సిద్దిపేట అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న మంత్రి హరీశ్ రావు జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక ప్రచార బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తున్నారు. సిద్దిపేటలో ముఖ్య నేతలకు ప్రచార బాధ్యతలను అప్పగించడమే కాకుండా వంద ఓట్ల కు ఒక ఇన్‌చార్జిని నియమించి పోలింగ్ రోజు వరకు ప్రచారాలు కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు. ఇతర నియోజకవర్గాల ప్రచార బాధ్యతలను పర్యవేక్షిస్తూనే ఎప్పటికప్పుడు సిద్దిపేట పరిస్థితులను సమీక్షిస్తున్నారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను ఎన్నికల ప్రచారాలకు సమాయత్తం చేయడంతో పాటు అసంతృప్తులను బుజ్జగిస్తూ ఒక్కటి చేస్తున్నారు. మల్లన్న సాగర్, కొండపొచమ్మ సాగర్ నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి హామి ఇచ్చి వారి మద్దతు పొందే ప్రయత్నాలు ప్రారంభించారు. దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర రెడ్డి పై దాడి జరగడంతో ఆయన ఆస్పత్రికే పరిమితమయ్యారు. దీంతో దుబ్బాక బాధ్యతలను కూడా తనపైనే వేసుకున్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపికైన విజ్ డమ్ స్కూల్ విద్యార్థి




**కొడిమ్యాల నవంబర్ 07 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలోని విజ్ డమ్ పాఠశాలకు చెందిన బైరి మనిత్ అను విద్యార్థి ఇటీవల సోలిపూర్ గ్రామం, వనపర్తి జిల్లాలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి ఖో ఖో క్రీడా పోటీలలో ఉమ్మడి కరీం నగర్ జిల్లా తరఫున ఎంపికై ఖోఖో క్రీడలో విశేష ప్రతిభ కనబరిచినాడు. ఈ విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం



**కోరుట్ల నవంబర్ 07 (ప్రజామంటలు):** కోరుట్ల మండలం నాగుల పేట గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడప కు బీఆర్ఎస్ అనే నినాదం తో ప్రచారం నిర్వహించారు. నాయకులు ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ మరియు ముఖ్య మంత్రి కెసిఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మళ్ళీ బీ ఆర్ ఎస్ ప్రభుత్వం రావాలని కోరుట్ల నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు తనయులు డా సంజయ్ కారు గుర్తుకు ఓటు వేసి బారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ సర్పంచ్ దారి శెట్టి రాజేష్, కోరుట్ల ఎంపిపి తోట నారాయణ, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు చీటి వెంకట్ రావు, రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నర్స రెడ్డి, సిఓ ఆప్షన్ మెంబర్ ఖయ్యూమ్, గ్రామ శాఖ అధ్యక్షులు సుధాకర్, నారాయణ రెడ్డి, మండల పార్టీ నాయకులు నత్తి రాజు కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేష్ గౌడ్, కోరుట్ల మండల సర్పంచులు అంజయ్య, మల్ల రెడ్డి,నర్సయ్య, ఎంపిటిసి లు సుభాష్ రెడ్డి,చైర్మన్ లు జగన్ రావు, అది రెడ్డి, నాయకులు రాజ నర్సయ్య, గోపాల్, భూమయ్య, ఇతర మండల నాయకులు మరియు నాగుల పెట బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కోరుట్ల పట్టణంలో అపర షిరిడీ గా పేరుగాంచిన సుప్రసిద్ధ సాయి బాబా దేవాలయ ఈవోగా దుబ్బ రాజేశ్వర స్వామి దేవాలయం ఈవో అనూష ఇంచార్జి ఈవోగా ఈ రోజు భాధ్యతలు స్వీకరించారు. దీనితో సాయిబాబా దేవాలయం దేవాదాయ శాఖ పరిధిలో వెళ్ళింది.

## జగిత్యాల భవిష్యత్ కోసం

# జీవన్ రెడ్డిని గెలిపించాలి

ఏఐసిసీ కార్యదర్శి వంశీ చందర్ రెడ్డి

పల్లె..పల్లె కదిలింది.. జన సంద్రమైన జగిత్యాల..

వీధులన్నీ కాంగ్రెస్ జెండాలతో జగిత్యాల

జైత్రయాత్రను మరిపించిన కాంగ్రెస్ ర్యాలీ

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉరకలేత్తిన ఉత్సాహం

ప్రశ్నించే గొంతుకకు పట్టం కడుతామంటు

జగిత్యాల నలుమూలల నుండి తరలివచ్చిన జనం

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పథకాల ప్లకార్డులు

జీవన్ రెడ్డి కి నాగలి బహుకరించిన అభిమానులు

జగిత్యాల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాటిపర్తి జీవన్ రెడ్డి

మంగళవారం కొండగట్టు ఆంజనేయ స్వామికి ముడుపు



**జగిత్యాల నవంబర్ 07 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ నుండి కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ మధ్య బయలుదేరి, జంబిగద్దె మీదుగా గొల్లపల్లి రోడ్డు, పాత బస్టాండ్ ర్యాలీగా వెళ్లి, స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం పాత బస్టాండ్ నుండి గంజ్ రోడ్డు, టవర్ సర్కిల్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు డప్పు చప్పుల్లు, పాటలతో, కార్యకర్తల నినాదాలు.. ప్ల కార్డుల ప్రదర్శనతో..భారీ ర్యాలీగా తరలి వెళ్లి కొత్త బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల్ని ఉద్దేశించి మాట్లాడారు. జీవన్ రెడ్డి గెలుపు ఖాయమని గుండెల నిండా అభిమానంతో తరలివచ్చి జీవన్ రెడ్డికి మద్దతు తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ ఏఐసిసీ కార్యదర్శిగా రాలేదు, జీవన్ రెడ్డి అభిమానిగా వచ్చాననీ వంశీ చందర్ రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి గెలుపు కోసం తెలంగాణ కోసం ఎదురు చూస్తుంది. ఓటరు దేవుళ్ళు చెయ్యి గుర్తుకు వేసే ఓటు జగిత్యాల, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు వేసే ఓటు అని అన్నారు. జీవన్ రెడ్డి ని చూసి స్ఫూర్తి పొందినం. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పాలన, కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలి. కరడుగట్టిన కాంగ్రెస్ వాది.. రైతు భాందవుడు జీవన్ రెడ్డి. నీతి, నిజాయితీకి మారు పేరు జీవన్ రెడ్డి. ప్రజల శ్రేయస్సు కోసం, ప్రజల అభి వృద్ధి కోసం జీవన్ రెడ్డి పాటు పడ్డారు. 40 ఏళ్లుగా కట్టే కుర్చీ మీద కూర్చుని, ప్రజలకు సేవలంది స్తున్నారు. పిసిసి అధ్యక్ష పదవి కన్న జగిత్యాల ప్రజలే ముఖ్యమని, పిసిసి పదవిని సైతం కాదనుకున్నారని ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్ రెడ్డి అన్నారు. నవంబర్ 30 న చెయ్యి గుర్తుకు ఓటు వేసి జీవన్ రెడ్డి ని ప్రజలు కంటికి రెప్పల కాపాడుకోవాల్సిన బాధ్యత జగిత్యాల ప్రజలపై ఉందన్నారు. నామినేషన్ అనంతరం భారీ ర్యాలీ తో వెళ్లి కొత్త బస్టాండ్ లో జీవన్ రెడ్డి మాట్లాడారు.ఎన్నికల్లో గెలుపే ప్రధానం కాదనీ తనకు అండగా నిలిచేందుకు వేలాదిగా తరలి వచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓడినా.. గెలిచినా ప్రజల మధ్యే ఉన్నా. జగిత్యాల ప్రజలు వెన్నంటి ఉన్నారు. చివరి శ్వాస వరకు ప్రజా సేవలోనే ఉంటాను. వైద్య కళాశాల ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్న ఒక్క సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకు రాలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జేఎన్టీయు కళాశాల, న్యాక్ కేంద్రం,వెటర్నరీ కళాశాల, వ్యవ సాయ కళాశాల ఏర్పాటు చేశామని, కరీంనగర్ నుండి హైదరాబాద్ కు వెయ్యి కోట్లతో రాజీవ్ గాంధీ రోడ్డు వేసినం అని గుర్తు చేశారు. గ్రామ గ్రామాన రోడ్లు చేసినట్లు తెలిపారు. బీ అర్ ఎస్ నాయకులకు ఎన్నికలు వస్తే రోడ్డు విస్తరణ గుర్తుకు వస్తదన్నారు. నాలుగేళ్ల ఐతుంది ఎందుకు రోడ్డు విస్తరించలేదు అని నిలదీశారు. జగిత్యాల పట్టణానికే పరిమితం చేయాల్సిన మాస్టర్ ప్లాన్ పరిసర గ్రామాల భూములు మాస్టర్ ప్లాన్లో చేర్చి భూముల విలువలు తగ్గేలా చేస్తే రైతులు ఉద్యమిస్తే వెనక్కి తగ్గారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత మాస్టర్ ప్లాన్ కేవలం జగిత్యాల కే పరిమితం చేస్తామని హామీ ఇచ్చారు. కేటీఆర్ కన్న పదేళ్ల ముందే జగిత్యాల లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసినం అని గుర్తు చేశారు. కామారెడ్డిలో రేవంత్ రెడ్డి గెలుపు ఖాయం అని జీవన్ రెడ్డి అన్నారు. అభివృద్ధి తెలంగాణ ప్రజల హక్కు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని సకల జనులు ఉద్యమిస్తే ఎంత మందికి ఉద్యోగాలు వచ్చినయ్, చెప్పాలనీ అన్నారు. వాళ్ల కుటుంబంలో మాత్రం ఉద్యోగాలు వచ్చినాయని తెలిపారు. కెసిఆర్ పాలనలో ఉద్యోగులు కనీసం ఒకటో తారీకు జీతం ఇచ్చినా చాలు అనే పరిస్థితి దిగజారింద న్నారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా బీడీ కార్మికులకు అందరికీ రు.4000 పెన్షన్ ఇస్తాం. కళ్యాణ లక్ష్మి పథకం కింద 1 లక్ష తోపాటు పెళ్లి కుతుర్కు 1తులం బంగారం ఇస్తాం. సిలిండర్ రు.500 లకే ఇస్తాం. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి జగిత్యాల నియోజక వర్గం నాంది పలుకాలని జీవన్ రెడ్డి అన్నారు.



## జిల్లా పోలీసులకు ఉలెన్ కోట్స్ పంపిణీ





**జగిత్యాల నవంబర్ 07 (ప్రజామంటలు):** జిల్లా పోలీసులకు మంజూరు అయిన నూతన ఉలెన్ కోట్స్ ను మంగళవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ ప్రధాన కార్యాలయం పంపిణీ చేశారు. విదినిర్వహణలో పోలీసు వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు హైదరాబాదులోని డీజీపీ కార్యాలయం నుండి తెప్పించి సిబ్బందికి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. పోలీస్ శాఖ గుర్తులతో కూడిన చలి కోటు, ఇతర వస్తువులను జాగ్రత్త చేసుకోవడం, పోలీస్ సిబ్బంది మాత్రమే వినియోగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర రావు, అడ్మిన్ ఆర్.ఐ. జానిమియా, ఆర్ఎసై వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలోకి వలసలు





**ఇబ్రహీంపట్నం నవంబర్ 07 (ప్రజా మంటలు):** మెట్టుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన 30 మంది మహిళలు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు 20 మంది గౌరవ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుకోరుట్ల నియోజకవర్గ బిఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరడం జరిగింది. వీరితో పాటు సర్పంచ్ కొప్పుల శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు మధు మరియు నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో పాల్గొన్న యువకులు



**ఎల్కతుర్తి నవంబర్ 07 (ప్రజామంటలు):** హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హైట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపే లక్ష్యంగా నేడు ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమలో భాగంగా ప్రతి ఇంటింటికీ తిరిగి కేసిఆర్ ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మేనిఫెస్టోను ప్రజలకు వివరించిన యువ నాయకులు. అలాగే కారు గుర్తుకు ఓటు వేసి వొడితల సతీష్ కుమార్ భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు వినయ్ రావు, శివకుమార్, గోపాల్ రావు, సతీష్, దిలీప్ రావు, అరుణ్ రావు, రాజ్ కుమార్, శ్యామ్ కుమార్, అజయ్, శ్రవణ్ రావు, మణిధర్ రావు, కృష్ణ, సాయి, సుధాకర్, ప్రశాంత్ రావు, రాజు, నవీన్, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

## 8న సీనియర్ బేస్ బాల్ క్రీడాకారుల ఎంపిక

బేస్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి



**జగిత్యాల నవంబర్ 07 (ప్రజామంటలు):** తెలంగాణ బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ బేస్ బాల్ ఆటలో ఎంపికలు జరుగుతున్నాయని అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని బేస్ బాల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు దప్పు తిరుపతి కోరారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నెల 9న మెదక్ జిల్లా మనోహారాబాద్ లో సీనియర్ బేస్ బాల్ సెలక్షన్ ట్రయల్ ఉన్నాయని వీటికై జగిత్యాల జిల్లా పరిధిలోని అర్హులైన సీనియర్ బేస్ బాల్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నామన్నారు. ఈ నెల 8న జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక కోసం ఏర్పాట్లు చేశామని క్రీడాకారులు వారి ఆధార్ కార్డు తీసుకొని రావాలని జిల్లా అధ్యక్షులు దప్పు తిరుపతి కోరారు. ఆయన వెంట ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ క్రీడాకారులు, పి.ఈ.టీలు ఉన్నారు.

## కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం



**మెట్ పల్లి నవంబర్ 07 (ప్రజామంటలు):** మెట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జువ్వడి నర్సింగ్ రావు అధ్యక్షతన పట్టణంలోని 26 వార్డుల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య నాయకులు కార్యకర్తలు పార్టీ గెలుపుకు పలు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జువ్వడి నర్సింగ్ రావు మాట్లాడుతూ పట్టణంలోని 26 వార్డుల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికులుగా నిలబడి కోరుట్ల నియోజకవర్గ%శీ% పార్టీ జెండా ఎగురవేయాలని అలాగే రాష్ట్రంలో పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో తెచ్చేందుకు కృషి చేయాలని ఈ 25 రోజులు కష్టపడితే పార్టీ అధికారంలోకి వస్తదని అలాగే నియోజకవర్గంలో తన గెలుపుకు అందరూ ఏకతాటిపై వచ్చి కృషి చేయాలని విన్నవించారు ప్రతి కార్యకర్తలకు తాను వెన్నుంటానని అందరితో కలుపుకపోయి ఎవరికి ఏ సహాయ సహకారం కావాలన్నా ముందుంటానని మీరందరూ కష్టపడి నా గెలుపుకు కృషి చేయాలని మీ కృషి కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, పూదారి నర్సాగౌడ్ కౌన్సిలర్ యమ రాజయ్య, మల్లాపూర్ మాజీ జెడ్పిటిసి ఎలాల జలపతి రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు అందె మారతి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు అబ్దుల్ హఫీజ్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అందే భవితరాణి, బాస చిన్నమ్మ, రోహిణి బేగం, హరిత, పూదరి రాము గౌడ్, కొమ్ముల సంతోష రెడ్డి, ముఖిమ్, షకీల్, కంబ సురేష్, పుల్ల రాజాగౌడ్, సోమిడి శివ మరియు పట్టణ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వకుంట్ల సంజయ్‌ని ఎమ్మెల్యే గెలిపించాలని

## తల్లి సరోజినమ్మ ప్రచారం



**మెట్ పల్లి నవంబర్ 07(ప్రజామంటలు):** మెట్‌పల్లిలో 20వ వార్డులో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సతీమణి కల్వకుంట్ల సరోజినమ్మ తనయుడు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ తరఫున కారు గుర్తుకు ఓటు వేసి కుమారుడు కల్వకుంట్ల సంజయ్ ని ఎమ్మెల్యే గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నాలుగు సార్లు మీ ఆశీర్వాదంతో గెలిచి అన్ని వర్గాల వారితో కలిసి అభివృద్ధి చేశారని మరోసారి ఎమ్మెల్యేగా తన కుమారుడిని గెలిపించి మరింత కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధికి సహకరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రానావేని సుజాత సత్యానారాయణ, కౌన్సిలర్స్ పూజాగిరి లక్ష్మీ శ్రీనివాస్, కొమిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఏనుగందుల వనజ, మార్గం లక్ష్మీ హనుమాన్లు, అంగడి పురుషోత్తం, గజం లక్ష్మి రవి, వేముల ప్రభాకర్, ఒజ్జల శ్రీనివాస్, జరుపుల భారతి, సారధి గౌడు, ఘాజే రాజారెడ్డి, పలువురు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయి

గండిపెల్లి గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తి చేయలేని అసమర్ధ పాలకులు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**హుస్నాబాద్ నవంబర్ 07 (ప్రజామంటలు):** బిజెపి బిఆర్ఎస్ పార్టీలు ప్రజలను మొసం చేస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గండిపెల్లి గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని సిఎం కెసిఆర్ కుర్చీ వేసుకుని కుకుండి కట్టిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న బిఆర్ఎస్ పాలకులు నిర్వాసితులకు అన్యాయం చేశారని ఇంకా వందలాది ఎకరాల భూములకు పరిహారం చెల్లించలేదని 2007లో నేను ఎమ్మెల్యేగా పనిచేసిన హయాంలో శంకుస్థాపన చేసిన పనులు నేటికీ వరకు పూర్తి చేయలేని బిఆర్ఎస్ పాలకుల అసమర్ధ పాలనకు నిదర్శనం అన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి బిఆర్ఎస్ పాలకులను గద్దె దించకుంటే ప్రజలకు మరిన్ని ఇబ్బందులు తప్పవని చాడ వెంకట రెడ్డి అన్నారు. కాంగ్రెస్ సిపిఐ ఎన్నికల అవగాహనతో కలిసి పని చేస్తున్నట్లు కొత్తగూడెం సిటుతో పాటు రెండు ఎమ్మెల్సీ కాంగ్రెస్ ఇచ్చేందుకు అంగీకరించిందని చాడ వెంకటరెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కళవేని శంకర్, సిద్ధిపేట కరీంనగర్ హన్మకొండ జిల్లాల సిపిఐ కార్యదర్శులు మంద పవన్,మర్రి వెంకటస్వామి, కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగడిపె మల్లేశ్, ఆదరి శ్రీనివాస్,సిపిఐ నియోజకవర్గ నాయకులు పొతిరెడ్డి వెంకటరెడ్డి, బోయిని అశోక్, యెడల వనేష్, జాగీర్ సత్యనారాయణ, కనుకుట్ల శంకర్, బత్తుల బాబు, కిష్టపురం లక్ష్మన్, అందే అశోక్, ఆది రంగారెడ్డి, సిపిఐ నాయకులు చాడ శ్రీదర్ రెడ్డి, కొయ్యడ కొమురయ్య, ఏగ్గొజు సుదర్శన్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా పోటీ ఏకైక లక్ష్యంగా..!

## పట్టువదలని విక్రమార్కుడు చల్లాకు చిక్కింది

**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్07 (ప్రజామంటలు):** "మొండి తనం ఆయన నైజం.. సేవాగుణం ఆయన తత్వం... మాట తప్పక పోవడం అతని స్వభావం.. మడమ తిప్పక పోవడం ఆయన లక్ష్యం. అతని లక్ష్యం మంథని నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా పోటీచేయడం, ఆ లక్ష్యం లో గమ్యం చేరేందుకు అనేక ప్రయత్నాలు, అలుపెరుగని పోరాటాలు, చివరకు ఒక జాతీయ పార్టీ అభ్యర్థిగా గడ్డపై బరిలోకి. అతనే చల్లా, పూర్వపు కరీంనగర్ జిల్లలోని తూరుపు ప్రాంత ప్రజలకు చిరు పరిచితుడై ప్రేమగా నారన్న గా పిలువబడే చల్లా నారాయణ రెడ్డి. సుదీర్ఘమైన రాజకీయ అనుభవం, అతిరథ మహారథులతో రాజకీయ సాన్నిహిత్యం, ప్రజలతో సన్నిహిత సంబంధాలు అతన్ని ప్రజా క్షేత్రంలో గొప్ప నాయకుణ్ణి చేశాయి. సుమారుగా నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో "ఇంట గెలిచి రచ్చ గెలవాలనే" విధంగా తన స్వంత గ్రామం నుంచి సర్పంచ్‌గా రాజకీయ పయనాన్ని ప్రారంభించి సింగిల్ విండో ఛైర్మెన్‌గా జెడ్పిటిసిగా, ఓటమి ఎరుగని నాయకునిగా పనిచేయడమే కాకుండా రిజర్వేషన్ లో భాగంగాఆయన సతిమణిని ఎంపిపిగా గెలిపించుకుని ప్రజా సేవకు అంకితమైన అతడు ఈ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు చేయాలని , ఇక్కడి ప్రజల్లో వెలుగులు నింపాలని వారిని ఆర్థిక సామాజిక రంగాల్లో ముందుకు తీసుకు వెళ్లాలంటే ఎమ్మెల్యే కావడం తప్ప వేరే మార్గం లేదనుకుని గడిచిన రెండు సంవత్సరాలుగా నిత్యం ప్రజలతో మమేకమై వారి కాస్త సుఖాల్లో తోడుగా ఉంటూ వస్తూ తాను పని చేస్తున్న బిఆరెస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా కృషిచేసి నప్పటికి ఆ పార్టీ పాత వారికే టిక్కెట్లు కేటాయించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆ పార్టీ కి రాజీనామా ప్రకటిస్తూ మంథని నుంచి ఎమ్మెల్యే గా పోటీ చేస్తానని పత్రిక ముఖంగా ప్రకటించడం జరిగింది. బిజెపి నాయకుల టికెట్ హామీతో తన అనుచర గణంతో కలసి బీజేపీలో చేరడం, అందులో కూడా నిరాశే మిగలడంతో బిజెపికి రాజీనామా ప్రకటించి, చివరి ప్రయత్నంగా బీఎస్పీ జాతీయ నాయకులతో సంప్రదింపులు ఆ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకుని ముహూర్తం ప్రకారం మంగళ వారం నాడు నామినేషన్ దాఖలు చేశాడు. ఏది ఏమైనా పట్టువదలని విక్రమార్కుడిలా ఎమ్మెల్యేగా పోటీ చేయడమే లక్ష్యంగా చల్లా పోటీ మంథని రాజకీయాలను మార్చుతాయని విశ్లేషకుల అంచనా.




## జగిత్యాలలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన 82 ఏళ్ల వృద్ధురాలు



**జగిత్యాల నవంబర్ 07 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన చీటి శ్యామల అనే వృద్ధురాలు తన బంధువులతో కలిసి నామినేషన్ వేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... తన పెద్ద కొడుకు కోర్టు కేసులు వేసి ఇబ్బంది పెడుతున్నాడని ఆమె నామినేషన్ వేసినట్లు తెలిపింది. ఆస్తిపై కేసు వేయటంతో తాను అద్దె ఇంట్లో ఉంటున్నానని అందుకే నామినేషన్ వేశానని అధికారులకు, ప్రభుత్వానికి తెలియాలనే నామినేషన్ వేశానని శ్యామల పేర్కొంది.

## ముల్కనూరులో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం



**భీమదేవరపల్లి నవంబర్ 07 (ప్రజామంటలు):** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో మంగళ వారం మండల కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. ప్రస్తుత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పథకాలు తప్ప అభివృద్ధి శూన్యం అని అన్నారు. అనంతరం వీరన్న నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ నియమాకాలు లేక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు, యూనివర్సిటీలలో పోస్టుల ఖాళీలు, ప్రాజెక్టుల పగుళ్లు ఇది బిఆర్ఎస్ ఘనత అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకులు కొలుగూరి రాజు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు చిగురాల స్వరూప, సీనియర్ నాయకులు చిట్టెంపల్లి ఐలయ్య, డబ్బా శంకర్, మాడుగుల గోపి, శివకుమార్, దేవరాజు శంకర్, యువ నాయకులు గజ్జల సురేష్, తాళ్లపల్లి పవన్, డా. ఎదులాపురం తిరుపతి, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఈటల తరపున నామినేషన్ వేసిన జెడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్

**జమ్మికుంట నవంబర్ 07 (ప్రజామంటలు):** హుజురాబాద్ రిటర్నింగ్ అధికారి రాజు కు బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ పక్షాన జమ్మికుంట జడ్పిటిసి శ్రీ రామ్ శ్యామ్ ఆధ్వర్యంలో నామినేషన్ సెట్ సమర్పించడం జరిగింది. అలాగే ఈటెల జమున తరుపున కూడా ఒక సెట్ సమర్పించడం జరిగింది. జడ్పిటిసి వెంటా ఈటెల సోదరుడు ఈటల భద్రయ్య. నాయకులు శివశంకర్, ఈటెల వ్యక్తిగత సహాయకుడు నరేందర్ పాల్గొన్నారు.




## నెల్లి లక్ష్మీనారాయణకు ఘన నివాళులు



**సికింద్రాబాద్ నవంబర్ 07 (ప్రజామంటలు):** దివంగత ఎమ్మెల్యే, సిటీ మాజీ మొదటి మేయర్, తొలితరం తెలంగాణ ఉద్యమ నాయకులు నెల్లి లక్ష్మీనారాయణ జయంతి ని సిటీలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్కులో ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకులు నెల్లి లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నెల్లి లక్ష్మీనారాయణ తెలంగాణ జాతికి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సమితి అద్యక్షులు అల్లం దుర్గం సురేశ్, నాయకులు పొట్లకాయల వెంకటేశ్వర్, వినయ్, శ్రీనివాస్, డాక్టర్ ఆనంద మూర్తి, వరుణ్ తేజ్, సంజయ్, ధర్మేంద్ర, రమేశ్, మురళి, కృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, పేదల పాలిట వరాలు



**జమ్మికుంట నవంబర్ 07 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 16,18,19,20,22,27 వార్డులలో సోనియా గాంధీ గారు ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను ఇంటింటికి గడపగడపకు తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ చైర్మన్ సలీం పాష, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ చిన్నింటి నాగేంద్ర, అరుకాల కార్తీక్, వార్డ్ అద్యక్షులు పందిళ్ళ శంకర్, పైతారి శ్రీకాంత్, దన్యాకుల మనోజ్ రెడ్డి, చిలువేరు రాజమౌళి, దొడ్డే నవీన్, లోనికి అంజి, కాంగ్రెస్ నాయకులు జున్నూతుల మారుతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు మంత్రి తలసాని నామినేషన్

### భారీ జన సమీకరణకు ఏర్పాట్లు



**సనత్నగర్ నవంబర్ 07 (ప్రజామంటలు):** రాష్ట్ర మంత్రి, సనత్ నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస యాదవ్ ఈనెల 9 గురువారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈసందర్భంగా ఆ రోజు ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో బన్సీలాల్ పేట డివిజన్ జబ్బర్ కాంప్లెక్స్ నుంచి సికింద్రాబాద్ బల్దియా ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. న:భూతో న:భవిష్యత్ రీతిలో కొనసాగే ఈ భారీ ర్యాలీకి జనసమీకరణకు ఆయా డివిజన్ లల్లో నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ బన్సీలాల్ పేట డివిజన్ పార్టీ ఇంచార్జ్ సాధం బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు కే. లక్ష్మీపతి, అరుణ్ గౌడ్, ప్రేమ్ కుమార్, కుమార్ యాదవ్, దేశపాక శ్రీనివాస్, కేఎం కృష్ణ, విజయ్ శంకర్, శివప్రసాద్, చిన్న లు మంగళవారం డివిజన్ లో పర్యటించారు. నామినేషన్ భారీ ర్యాలీకి జన సమీకరణ పార్టీ శ్రేణుల ప్రతి ఒక్కరి బాధ్యత అని పార్టీ ఇంచార్జీ సాధం బాలరాజ్ పేర్కొన్నారు.

## మంత్రి గంగుల కమలాకర్‌పై జమ్మికుంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**జమ్మికుంట నవంబర్ 07 (ప్రజామంటలు):** తెలంగాణ మైనారిటీ ఫోరం ఆధ్వర్యంలో నేడు 7 నవంబర్ మంగళవారం మధ్యాహ్నం 1-30 గంటలకు జమ్మికుంట పోలీస్ స్టేషన్లో తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జలకాంతం పైన మరియు రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ పైన జమ్మికుంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు. గత నాలుగవ తేదీన తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ ప్రజా ఆశీర్వాద సభలో జెఎసి చైర్మన్ గజ్జలకాంతం మాట్లాడుతూ.... గంగుల కమలాకర్ ను ఇట్టి మీటింగునకు ఆహ్వానించడానికి తన వద్దకు వెళ్ళిన క్రమంలో మంత్రి గంగుల కమలాకర్ తెలంగాణలో ఉన్న తురక ముండకొడుకులను ఎందుకు నీ వెంట ఏసుకు తిరుగుతున్నవు అని ముస్లిం మైనార్టీలను అవమానపరిచారని గజ్జల కాంతం ఈ మీటింగ్లో బహిరంగంగా చెప్పడం జరిగింది. ఇందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనార్టీలను ముండా కొడుకులుగా పేర్కొన్న విషయమై పూర్తి వీడియో ఆధారాలతో సంబంధిత పోలీస్ స్టేషన్లో గజ్జల కాంతం మరియు గంగుల కమలాకర్ లపై ఫిర్యాదు చేయడం జరుగింది. ఈ సందర్భంగా సంబంధిత ఫిర్యాదు విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తూ బాధ్యులపైన శాఖపరమైన చర్యలు చేపట్టాలని పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ముస్లిం మైనారిటీలకు ఈ విషయంలో న్యాయం జరగనియెడల రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయటంతో పాటు రాష్ట్ర హైకోర్టు లో కేసు నమోదు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సమితి మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబీర్ అలీ, తెలంగాణ మైనారిటీ ఫోరం సభ్యులు మొహమ్మద్ గయాస్ ఖాన్, తెలంగాణ బిసి సంక్షేమ సమితి హుజురాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్ మరియు న్యాయవాది కొత్తూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిష్పక్షపాతంగా ఎన్నికల విధుల నిర్వహణ

### ఈవిఎం యంత్రాల కమిషనింగ్‌కు ప్రణాళికాబద్ధంగా సిద్దం చేయాలి

### ఓటరు స్లిప్పుల పంపిణీ పై జిల్లాలో నోడల్ అధికారి నియమించాలి

### సివిజల్ యాప్‌పై విస్తృతంగా ప్రచారం కల్పించాలి

### రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అవసరమైన అనుమతులను నిబంధనల మేరకు సకాలంలో అందించాలి

### వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్






**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 07 (ప్రజామంటలు):** అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో అధికారు లు సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గద ర్శకాలను పాటిస్తూ నిష్పక్షపాతంగా ఎన్నికల విధులను నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరా బాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర డీజీపీ అంజనా కుమార్, ఎన్నికల పరిశీల కులు, ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర ఈవిఎం యంత్రాల సర్దుబాటు చేయాల్సి ఉంటుందని, అ వసరమైతే అదనపు బ్యాలెట్ యూనిట్ల జిల్లాకు అందించడం జరుగుతుందని, నవంబర్ 18న రెండవ దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెం డింగ్ ఓటరు నమోదు దరఖాస్తుల 3 రోజుల వ్యవధిలో పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల తనిఖీలలో నగదు, బంగారం ఇతర ఆభరణాలు జప్తు చేసే సమయంలో ఈ.ఎస్.ఎం.ఎస్. యాప్ లో క్షేత్రస్థాయిలో వెంటనే నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారం సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఓటర్ స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని, ఓటరు స్లిప్పుల పంపిణీ నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రారంభించాలని, జిల్లాలో నోడల్ అధికారిని నియమించి ప్రతిరోజు ఓటర్ స్లిప్పుల పంపిణీ పై సమీక్ష నిర్వహించాలన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా విస్తృతంగా స్వీప్ కార్యక్ర మాలు నిర్వహించాలని అన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరె, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తదిత రులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

## ఆ ఆయుధాన్ని డబ్బుకు అమ్ముకోవద్దు

## చెన్నూరు ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్



**చెన్నూరు,నవంబరు7:** ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని.. డబ్బుకు ఆ ఆయుధాన్ని అమ్ముకోవద్దని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. ఎన్నికల వేళ ప్రజలు విచక్షణతో ఆలోచించి అభ్యర్థిని ఎన్నుకోవాలన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఇంకా పరిణతి రావాలని.. ఎన్నికల వేళ ప్రజలు విచక్షణతో ఓటు వేయాలని బీఆర్?ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని.. డబ్బుకు ఓటును అమ్ముకోవద్దని సూచించారు. ఓటు వేసే ముందు అభ్యర్థి గుణగుణాలు తెలుసుకోవాలన్న సీఎం.. మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కాంగ్రెస్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్ పార్టీనే అని కేసీఆర్ ఆరోపించారు. స్వరాష్ట్రం రాకముందు వరకు భయంకర పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. సింగరేణిలో 49 శాతం వాటాను కేంద్రానికి కట్టబెట్టింది హస్తం పార్టీ అని దుయ్యబట్టారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం యత్నిస్తోందని.. ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నది భారత్ రాష్ట్ర సమితి అని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రైతుబంధు ఆపాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారని.. రైతులకు 3 గంటల కరెంటు ఉండాలని రేవంత్ రెడ్డి చెబుతున్నారని కేసీఆర్ అన్నారు. భారతదేశంలో 24 గంటల కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని చెప్పారు. ఎన్నికలు వచ్చాయంటే కాంగ్రెస్, బీజేపీ నేతలు వస్తారన్న ఆయన.. సంక్షేమ పథకాలు వద్దంటున్న కాంగ్రెస్ నేతలకు డిపాజిట్లు రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వేళ ప్రజలు విచక్షణతో ఓటు వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. డబ్బుకు ఓటు అమ్ముకోవద్దు. మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఓటు వేసే ముందు అభ్యర్థి గుణగుణాలు తెలుసుకోవాలి. తెలంగాణ రాకముందు వరకు భయంకర పరిస్థితులు ఉండేవి. రైతు బంధు ఆపాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు. రైతులకు 3 గంటల కరెంటు ఉండాలని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఎన్నికలు వచ్చాయంటే కాంగ్రెస్, బీజేపీ నేతలు వస్తుంటారు. సంక్షేమం కొనసాగాలంటే మరోసారి బీఆర్?ఎస్? అధికారంలోకి రావాలని అన్నారు. కాంగ్రెస్‌కు దళితులపై ఉన్నది పెదవులపై ప్రేమే అని కేసీఆర్ విమర్శించారు. హస్తం పార్టీ ఏనాడూ అంబేడ్కర్ ఆశయాలను అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తోందని.. సీఎం, మంత్రులు కొలువు దీరే కార్యాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టామని గుర్తు చేశారు. ప్రపంచంలోనే ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం హైదరాబాద్‌లోనే ఉందని తెలిపారు. ఈ సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్?ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ఎల్ఎల్‌సీ రెండవ ఎడిషన్‌కు రంగం సిద్ధం

లెజెండ్స్ లీగ్ క్రికెట్(ఎల్ఎల్‌సీ) రెండవ ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 18 నుంచి డిసెంబర్ 9 వరకు ఎల్ఎల్‌సీ టోర్నీ జరుగనుంది. డెహ్రాడూన్, రాంచీ, జమ్మూ, విశాఖపట్నం, సూరత్ నగరాల్లో లెజెండ్స్ లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ టోర్నీలో అర్బన్ రైజర్స్ హైదరాబాద్, ఇండియా క్యాపిటల్స్, మణిపాల్ టైగర్స్, గుజరాత్ జెయిం ట్స్, సదరన్ సూపర్ స్టార్స్, బిల్వారా కింగ్స్ పోటీపడుతున్నాయి. అయితే రెండో సీజన్‌కు ప్రచారం కల్పించడంలో భాగంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎల్ఎల్‌సీ ట్రోఫీ టూర్ నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. రేపటి నుంచి ఢిల్లీలో ప్రచారం ప్రారంభం అవుతుంది. 15 రోజుల పాటు.. 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రచారం జరుగనుంది.

ఈ ప్రచారంలో పలువురు కేంద్ర మంత్రులు, భారతీయ రైల్వే బృందం భాగం కానున్నారు. దేశంలోని ప్రముఖ క్రీడా ప్రముఖులు కూడా ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో పాల్గొంటారు. గౌతమ్ గంభీర్, సురేశ్ రైనా, ఇర్ఫాన్ పఠాన్, క్రిస్ గేల్, కెవిన్ పీటర్సన్, ఎస్ శ్రీశాంత్, పార్థివ్ పటేల్, షేన్ వాట్సన్, ప్రవీణ్ కుమార్, ఝులన్ గోస్వామి వంటి వెటరన్‌లు ఈ ప్రత్యేక ప్రచారంలో చేరనున్నారు. ఎల్ఎల్‌సీ ట్రోఫీని వందేభారత్ రైళ్లలో ఊరేగింపడంపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. లెజెండ్స్ లీగ్ క్రికెట్, లెజెండరీ ఆటగాళ్లను వందే భారత్‌కు స్వాగతిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే ఈ అద్భుతమైన ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. మరోవైపు లెజెండ్స్ లీగ్ క్రికెట్ కమిషనర్ రవిశాస్త్రి మాట్లాడుతూ.. భారతీయ రైల్వేతో భాగస్వామ్యం, క్రీడల ప్రోత్సాహానికి దోహదపడటం తమకు గర్వకారణమన్నారు. లెజెండ్స్ లీగ్ కు ఆదరణ పెరుగుతుందని.. ఈ సీజన్‌లో లెజెండ్స్ రాక్ అవుతుందని అన్నారు.

## ఆస్ట్రేలియా ముందు భారీ టార్గెట్

న్డే ప్రపంచకప్‌లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్ మధ్య 39వ మ్యాచ్ జరుగుతోంది. ఆఫ్ఘనిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 291 పరుగులు చేసింది. దీంతో ఆస్ట్రేలియా ముందు 292 పరుగుల టార్గెట్ నిలిచింది.

ప్రపంచకప్‌లో జద్రాన్ తొలి సెంచరీని పూర్తి చేశాడు. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (129 పరుగులు) సెంచరీతో ఆసీస్ బౌలర్లపై సత్తా చాటాడు. ప్రపంచకప్‌లో సెంచరీ చేసిన తొలి ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. జద్రాన్ వన్డే కెరీర్‌లో ఇది నాలుగో సెంచరీ. ఆస్ట్రేలియా జట్టులో జోష్ హేజిల్‌వుడ్ 2 వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్, గ్లెన్ మాక్స్‌వెల్, ఆడమ్ జంపా ఒక్కో వికెట్ తీశారు.

## 2023 ప్రపంచకప్ నుంచి

## షకీబ్ అల్ హసన్ ఔట్

బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ 2023 ప్రపంచకప్ నుంచి నిష్క్రమించాడు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో గాయపడిన షకీబ్ అల్ హసన్ ఈ టోర్నీకి దూరమయ్యాడు. షకీబ్ వేలికి గాయమైనట్లు బంగ్లాదేశ్ టీమ్ ఫిజియో తెలియజేశారు. ఢిల్లీలో మ్యాచ్ ముగిసిన తర్వాత అతడి వేలికి ఎక్స్ రే చేయగా అందులో ఫ్రాక్చర్ కనిపించింది. ఈ గాయం కారణంగా షకీబ్ బంగ్లాదేశ్ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆడలేడు. బంగ్లాదేశ్ తన చివరి లీగ్ మ్యాచ్‌ని నవంబర్ 11న ఆస్ట్రేలియాతో ఆడాల్సి ఉంది. ఈ టోర్నీ కెప్టెన్‌గా, ఆటగాడిగా షకీబ్ అల్ హసన్‌కు చాలా చెడ్డదిగా మారింది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఆటగాడు తప్పుడు కారణాలతో వెలుగులోకి వచ్చాడు. ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టు ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్‌తో షకీబ్ అల్ హసన్ టైమ్ అవుట్ చేయాలంటూ అప్పీల్ చేశాడు. ఆ తర్వాత ఈ ఆటగాడు వివాదాస్పద రీతిలో ఔటయ్యాడు. మాథ్యూస్‌కు సమయం ఇచ్చిన తర్వాత, క్రికెట్ నిపుణులు, అభిమానులు ఈ ఆటగాడిని చాలా ట్రోల్ చేస్తున్నారు. షకీబ్ అల్ హసన్ వివాదాలలోకి వచ్చి ఉండవచ్చు. కానీ, అతను ఖచ్చితంగా శ్రీలంకపై బంగ్లాదేశ్‌ను విజయం వైపు నడిపించాడు. బంగ్లాదేశ్ విజయానికి 280 పరుగులు చేయాల్సి ఉండగా, కెప్టెన్ షకీబ్ 65 బంతుల్లో 82 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అయితే, ఈ మ్యాచ్‌లో అతని వేలికి గాయం కావడంతో రాత్రి మ్యాచ్ ముగిసిన తర్వాత అతని వేలిని పరిశీలించగా అది ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. ఇప్పుడు షకీబ్ అల్ హసన్ 4 నుంచి 6 వారాల పాటు ఆడలేడు. ప్రపంచ కప్‌లో షకీబ్ అల్ హసన్ 7 మ్యాచ్‌ల్లో బ్యాటింగ్‌తో 186 పరుగులు మాత్రమే చేశాడు. అతని బ్యాటింగ్ సగటు 26.57గా నిలిచింది. అదే సమయంలో అతను మొత్తం టోర్నమెంట్‌లో కేవలం ఒక అర్ధ సెంచరీ మాత్రమే సాధించగలిగాడు. బౌలింగ్‌లో షకీబ్ 9 వికెట్లు తీశాడు.

శ్రీలంక: కుసల్ మెండిస్ (వికెట్ కీపర్/కెప్టెన్), పాతుమ్ నిస్సాంక, కుసల్ పెరీరా, సదీర సమరవిక్రమ, చరిత్ అసలంక, ఏంజెలో మాథ్యూస్, ధనంజయ్ డి సిల్వా, మహీష్ తీక్షణ, దుష్మంత చమీర, కసున్ రజిత, దిల్షన్ మధుశంక.

బంగ్లాదేశ్ : తంజీద్ హసన్, లిటన్ దాస్, నజ్ముల్ హొస్సేన్ శాంటో, ముష్ఫికర్ రహీమ్ (వికెట్ కీపర్), మహ్మదుల్లా, షకీబ్ అల్ హసన్ (కెప్టెన్), తౌహీద్ హృదయ్, మెహదీ హసన్ మిరాజ్, తంజిమ్ హసన్ షకీబ్, తస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం.

# మిజోరం, ఛత్తీస్‌గఢ్‌లో ముగిసిన ఓటింగ్

## 77శాతం పోలింగ్ నమోదు




**మిజోరం,నవంబరు7:** ఈశాన్య రాష్ట్రం మిజోరం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం నుంచే ఓటర్లు ఆసక్తి చూపారు. ఫలితంగా రికార్డ్ స్థాయిలో 77 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇంకా కొన్ని పోలింగ్ బూతుల నుంచి వివరాలు అందలేదని.. వాటిని పరిగణలోకి తీసుకుంటే సుమారు 80 శాతం దాటే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అంతకుముందు మిజోరం సీఎం జోరంథంగా అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈవీఎం సమస్య కారణంగా ఆయన తొలిసారి అయిజోల్ నార్త్?-2 పోలింగ్ కేంద్రానికి ఎన్నికల కేంద్రానికి వచ్చి ఓటు వేయలేక వెనుతిరిగారు. తర్వాత అల్పాహారం తినడానికి వెళ్లి.. 11 గంటల సమయంలో మళ్లీ పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆ రాష్ట్ర ఎన్నికల్లో ఓటేశారు. అయిజోల్?లోని సౌత్-2 పోలింగ్ స్టేషన్?లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటేసిన ముఖ్యమంత్రి జోరంథంగా ఓటేసిన 101 ఏళ్ల వృద్ధుడు, 96 ఏళ్ల దివ్యాంగుడు ఓ శతాధిక వృద్ధుడు తన భార్యతో కలిసి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చంపాయి దక్షిణ నియోజకవర్గానికి చెందిన 101 ఏళ్ల వయసున్న పు రౌలనుదల.. 86 ఏళ్ల తన భార్యతో వచ్చి ఓటు వేశారు. వీరే కాకుండా 96 ఏళ్ల దివ్యాంగుడు అయిజాల్?లోని తన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిజోరంలో మొత్తం 40 స్థానాలకు ఓటింగ్ జరిగింది. మొత్తం 12 వందల 76 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల నేపథ్యంలో బంగ్లాదేశ్, మయన్మార్‌తో మిజోరం పంచుకుంటున్న సరిహద్దుల వెంబడి.. పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. మణిపుర్, అసోం, త్రిపుర రాష్ట్రాల.. సరిహద్దులను మూసి వేశారు. ఈ ఎన్నికల్లో 174 మంది అభ్యర్థుల తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్.. ఈ ఎన్నికల్లో గెలిచి మరోసారి పాలన సాగించాలని భావిస్తోంది. మరోవైపు.. జోరాం పీపుల్స్ మూమెంట్, బీజేపీ, కాంగ్రెస్.. అధికార పార్టీని గద్దెదించాలని ప్రయత్నిస్తున్నాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో మిజో నేషనల్ ఫ్రంట్ 26 సీట్లు సాధించింది. కాంగ్రెస్‌కు 5, బీజేపీకి ఒక సీటు దక్కింది. ఛత్తీస్ గఢ్‌లోని పలు నియోజకవర్గాలకు మంగళవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభ మైంది. 20 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో 12 స్థానాలు.. బస్తర్ డివిజన్‌లో ఉన్నాయి. వీటిలో సమస్యాత్మక అంతగఢ్, భానుప్రతాపుర్, కంకేర్, కేష్‌కల్, కొండగావ్, నారాయణపుర్, దంతెవాడ, బీజాపూర్, కొంటా స్థానాల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. మధ్యాహ్నం 3 గంటల వరకు జరగనుంది. బస్తర్, జగదల్‌పుర్, చిత్రకోట్‌లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్ జరగనుంది. 20 స్థానాల్లో మొత్తం 223 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 40 లక్షల మంది ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు.

# బీఆర్ఎస్ ఓటమి ఖాయం


## ఢంకా భజాయించి చెబుతున్నా

## తొమ్మిదేళ్లుగా అధికారంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విరోధి

## విరోధిని ఇంటికి పంపాల్సిన అవసరం ఉంది

## రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

## బీసీ ఆత్మ గౌరవ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**హైదరాబాద్,నవంబరు7:** హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ ఆత్మ గౌరవ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ, యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామివారిని పీఎం స్మరించుకున్నారు. నా కుటుంబసభ్యులారా అంటూ తెలుగులో ప్రసంగించిన మోదీ.. 'మీ ఆశీర్వాదంతోనే ప్రధాని అయ్యాను.. మీ ఆశీర్వాదంతోనే త్వరలో బీజేపీ బీసీ వ్యక్తి సీఎం అవుతారు' అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీపైనే విశ్వాసంతో ఉన్నారన్న ఆయన.. అన్నివర్గాల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. తొమ్మిదేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విరోధి అధికారంలో ఉన్నారని సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి మోదీ ధ్వజమెత్తారు. ఆ విరోధిని ఇంటికి పంపాల్సిన అవసరం ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ఉద్యమం వచ్చిందన్న మోదీ.. ఆ మూడింటి విషయంలో బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో అమరులయ్యారని.. స్వరాష్ట్రంలో బీసీలను మోసం చేశారని మండిపడ్డారు. బీసీల ఆకాంక్షలను కేసీఆర్ సర్కార్ ఏనాడూ పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్? కాంగ్రెస్ సీ టీమ్ అని.. కాంగ్రెస్ బీఆర్?ఎస్ సీ టీమ్ అని ఆరోపించారు. రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని చెప్పారు. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలు బీఆర్?ఎస్, కాంగ్రెస్ లక్షణాలని ఆక్షేపించారు. బీసీల ఆకాంక్షలను పట్టించుకునేది బీజేపీ మాత్రమేనని మోదీ స్పష్టం చేశారు. బీసీలకు ఎక్కువ టికెట్లు ఇచ్చింది తమ పార్టీనే అని తెలిపారు. అబ్దుల్ కలామ్, రామ్‌నాథ్ కోవింద్, గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేసిన ఘటన భారతీయ జనతా పార్టీకే దక్కుతుందన్నారు. ఈ క్రమంలోనే ఓబీసీని అయిన తనను ప్రధానిని చేసింది, ఓబీసీలకు ఎంపీలుగా ఎక్కువ అవకాశాలిచ్చింది బీజేపీ అని చెప్పారు. బీసీ యువత కోసం బీఆర్?ఎస్ పార్టీ ఏమీ చేయట్లేదని.. వారికి రూ.లక్ష ఇస్తామని వాగ్దానం చేసి నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్?ఎస్ నేతల్లో అహంకారం కనిపిస్తోందని మోదీ మండిపడ్డారు. అవినీతి సర్కారును ఇంటికి పంపడం తథ్యమన్నారు. ఢంకా భజాయించి చెబుతున్నా.. బీఆర్ఎస్ ఓటమి ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలని ఆరోపించారు. తెలంగాణ యువతను కేసీఆర్ సర్కారు మోసం చేసిందన్న మోదీ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ.. యువత జీవితాలను దుర్భరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతను మోసం చేసిన బీఆర్ఎస్‌ను ఇంటికి పంపాలా.. వద్దాఅని ప్రశ్నించిన ప్రధాని.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అధికారంలోకి వస్తే పేదలకు ఐదేళ్ల పాటు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తామని.. ఇది మోదీ ఇస్తున్న గ్యారెంటీ అని స్పష్టం చేశారు. సకల జనుల పోరాటంతో తెలంగాణ సాధించుకున్నామని, 4 కోట్ల మంది పోరాటం చేస్తేనే తెలంగాణా వచ్చిందన్నారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. అయితే నీరు-నిధులు-నియామకాలు అందరికీ అందుతున్నాయా అనేదే ఇక్కడ ప్రశ్న అని అభిప్రాయపడ్డారాయన. తెలంగాణలో మోదీ ఆధ్వర్యంలో బీసీ అధికారం సాకారం కావాలన్నారు పవన్ కళ్యాణ్. నోటితో చెప్పడం తేలికేనని.. చేయడం కష్టమని.. బీసీ ముఖ్యమంత్రిని బీజేపీ ప్రకటించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆ ప్రకటనకు జనసేన పూర్తి మద్దతు ఉంటుందన్నారు పవన్. ప్రధాని మోదీపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2004-14 వరకు ఎన్నో ఉగ్రవాద దాడులు జరిగాయని.. కానీ మోదీ వచ్చినప్పటి నుంచి వాటిని కంట్రోల్ చేశారని పవన్ కళ్యాణ్ అన్నారు. 30 ఏండ్లల్లో లేని అభివృద్ధి.. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన 10 ఏండ్లలో జరిగిందన్నారు. ఉగ్రవాదాన్ని అరికట్టడమే కాదు.. ప్రతీ భారతీయుడి గుండెల్లో మోదీ ధైర్యం నింపారని కొనియాడారు. 'మోదీ ఎన్నికలనే దృష్టిలో పెట్టుకుంటే ట్రిపుల్ తలాక్ రద్దు చేసే వారు కాదు.. ఆర్టికల్ 370 రద్దు చేసేవారు కాదు. ఆయన అద్భుతమైన విజనరీ లీడర్. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచింది. ప్రపంచం మొత్తం మనల్ని ప్రశంసిస్తోంది' అని అన్నారు పవన్ కళ్యాణ్. ప్రధాని మోదీ ప్రోత్సాహంతోనే చంద్రయాన్ 3 విజయం సాధించిందని చెప్పారు. దేశంలో మరోసారి మోదీ అధికారంలోకి రావాలంటూ 'ఔర్ ఏక్ బార్ మోదీజీ' అని పవన్ కళ్యాణ్ నినదించారు.

## తెలంగాణలో పక్కా ప్రణాళికతో

## ఎన్నికలు నిర్వహించాలి

### అధికారులకు సీఈసీ పలు సూచనలు

**హైదరాబాద్,నవంబరు7:** రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ముమ్మర చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉన్నతాధికారులకు పలు ఆదేశాల జారీ చేసింది. అందులో భాగంగా నియమించిన ముగ్గురు ప్రత్యేక పరిశీలకులు.. రాష్ట్రానికి చెందిన అధికారులతో భేటీ అయ్యారు. ఎన్నికల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సీఈసీ పలు సూచనలు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే పోలీసులను.. ఆ కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రస్తుతం పనిచేస్తున్న వారు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే పోలీసులు చేయాల్సిన.. చేయకూడని పనులతో జాబితా రూపొందించి అందించాలని ఈసీ ప్రత్యేకంగా నియమించిన అధికారుల బృందం సూచించింది.

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సమావేశమయ్యారు. ఈసీ ప్రత్యేక పరిశీలకులుగా నియమించిన విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు అజయ్ వి. నాయక్, దీపక్ మిశ్రా, బాలకృష్ణన్ సమావేశంలో పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారు కచ్చితంగా పాటించాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. రాజకీయ కార్యక్రమాలను వీడియోలు తీయడంపై అన్ని వీడియో నిఘా బృందాలకు శిక్షణ ఇవ్వాలని, అయితే వారు మొబైల్ ఫోన్లతో కాకుండా కచ్చితంగా కెమెరాలతోనే చిత్రీకరించాలని.. పరిశీలకులు సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న అన్ని ఫారం 6 దరఖాస్తులను ఈనెల 10 లోగా పరిష్కరించాలని స్పష్టంచేశారు. ప్రతి జిల్లాలో ఓటర్ల జాబితాపై వచ్చిన ఫిర్యాదులను ఫిర్యాదుదారు ఫోన్ నంబర్‌తో నమోదు చేయాలని సూచించారు.కొందరు ఫిర్యాదుదారులను సంప్రదించడం ద్వారా పరిష్కారాలను ధృవీకరించాల్సి ఉంటుందని వివరించారు. అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు మొబైల్ ఫోన్లలో సీవిజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారులు నిర్ధారించుకోవడం సహా.. సీవిజిల్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వెలుపల వీడియోగ్రఫీ అవసరమని భావించిన వాటిని గుర్తించి జాబితా సిద్ధం చేయాలనీ.. ఆ కెమెరాల ఫుటేజీని పోలీసు కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేయాలని ప్రత్యేక పరిశీలకులు స్పష్టంచేశారు. పోలింగ్ రోజున మీడియా ఛానళ్లపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఏర్పాట్లు చేయాలని.. ఏదైనా ప్రతికూల వార్త ప్రసారమైతే నోడల్ అధికారి వెంటనే వాస్తవ వివరాలు తెలుసుకోవాలని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పూర్తి సామర్థ్యంతో.. మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని చెప్పారు. వారి సామర్థ్యం మేరకు పని చేయాలని డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ అజయ్ బాదూ ఆదేశించారు. ఎన్నికల వ్యయ బాధ్యతలు చూసే ఈసీ డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ్, ప్రత్యేక వ్యయపరిశీలకుడు బాలకృష్ణన్ సీనియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమావేశమయ్యారు.

# ఆ చీర నాకు ప్రాణం



పెళ్లి చీరలో జాతీయ అవార్డును అందుకొని అందరి దృష్టిని ఆకర్షించింది అందాభామ అలియాభట్. ఈ విషయంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. 'ఆ చీర నాకు ప్రాణం. ఏదైనా పెద్ద ఈవెంట్ అయితే ముందు గుర్తొచ్చేది ఆ చీరే. నాకు నగలపై కూడా ఇంట్రెస్టుండదు. ఆ చీర అంటే మాత్రం ఎందుకో పిచ్చి. సాధారణంగా నాలాంటి ఆడవాళ్లు ఇలాంటి వేడుకల్లో కొత్తకొత్త డ్రస్సులో కనిపించాలనుకుంటారు. నేను మాత్రం ఆ చీరలోనే కనిపించాలనుకుంటా. నాకు అదో తృప్తి' అంటూ చెప్పుకొచ్చింది అలియా. తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందిస్తూ ' కుటుంబంతో ప్రశాంతంగా ఉండాలనుకుంటే ముఖ్యంగా మనం సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి. అక్కడి కామెంట్స్ చదివినా, చూసినా మనశ్శాంతి ఉండదు. అపోహలు, అపార్థాలు తలెత్తే ప్రమాదం ఉంది. నా అదృష్టం.. అర్థం చేసుకునే భర్త దొరికాడు' అని ఆనందం వ్యక్తం చేసింది అలియాభట్


# భవిష్యత్తులో ఆలోచన మరింత భయానకంగా ఉంది





నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ఈ పేరు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. అందుకు కారణంగా ఆమెకు సంబంధించిన ఓ డీప్‌ఫేక్ వీడియో వైరల్ కావడమే. కొందరు జారా పటేల్ అనే ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌కి సంబంధించిన వీడియోకి రష్మిక ముఖాన్ని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అదికాస్తా వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీనిపై నెటిజన్లు, రష్మిక అభిమానులే కాదు పలువురు స్టార్స్ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ కూడా ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వెంటనే యాక్షన్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాజాగా రష్మిక ఫేక్ వీడియోపై టాలీవుడ్ స్టార్ నటుడు నాగచైతన్య స్పందించారు. 'టెక్నాలజీని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో చూస్తుంటే నిజంగా ఎంతో నిరుత్సాహం కలిగిస్తోంది. భవిష్యత్తులో ఇది ఏ స్థాయికి చేరుతుందో అన్న ఆలోచన మరింత భయానకంగా ఉంది. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలి. దీని బారిన పడిన బాధితులైన వారిని రక్షించడానికి కఠిన చట్టాల్ని అమలు చేయాలి' అని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

# యాత్ర 2 రెడీ



టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్లలో ఒకరు మహి వి రాఘవ్. ఈ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి 2019లో వచ్చిన పొలిటికల్ జోనర్ ప్రాజెక్ట్ యాత్ర. ఏపీ (పూర్వ ఆంధ్రప్రదేశ్) దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రయాణం నేపథ్యంలో తెరకెక్కిన ఈ బయోపిక్ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. వైఎస్సార్ పాత్రలో మమ్ముట్టి నటించారు. తాజాగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచేందుకు సీక్వెల్ యాత్ర 2 రెడీ అవుతోంది. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి పొలిటికల్ జర్నీ నేపథ్యంలో వస్తోన్న సీక్వెల్ ప్రాజెక్ట్‌లో వైఎస్సార్ (తండ్రి)పాత్రలో మమ్ముట్టి నటిస్తుండగా.. వైఎస్ జగన్ (కొడుకు పాత్ర)గా కోలీవుడ్ యాక్టర్ జీవా లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందించాడు డైరెక్టర్. వైఎస్ జగన్ రాజకీయ ప్రయాణంలో అప్పటి కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ కూడా ఉంటుందని తెలిసిందే. ఈ చిత్రంలో కథానుగుణంగా సోనియాగాంధీ పాత్ర ఉండనుండగా.. ఈ రోల్‌లో కనిపించబోయే నటి ఎవరో క్లారిటీ ఇచ్చాడు డైరెక్టర్. సోనియాగాంధీ రోల్‌లో జర్మనీ నటి సుజానే బెర్‌నెర్ట్ నటిస్తోంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఫస్ట్ లుక్ కూడా విడుదల చేశాడు. సోనియాగాంధీకి కాపీలా ఉన్న సుజానే లుక్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. జర్మనీలో జన్మించిన సుజానే కమర్షియల్ యాడ్స్, హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, పలు టీవీ సీరియల్స్‌లో నటించింది. మరి సుజానే బెర్‌నెర్ట్ యాత్ర 2లో ఎలాంటి పర్‌ఫార్మెన్స్ ఇవ్వబోతుందని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు సినీ జనాలు. కాగా యాత్ర 2లో ఏపీ మాజీ సీఎం, టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు పాత్ర కూడా ఉండనుండగా.. ఈ పాత్రలో ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ మహేశ్ మంజ్రేకర్ కనిపించబోతున్నారని ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.యాత్ర 2ను, సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఏపీ ఎన్నికలకు ముందు 2024 ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. యాత్ర 2 నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ ఇప్పటికే సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి.

# ఈ ఘటనతో తీవ్రంగా కలత చెందా : జారా పటేల్



నేషనల్ క్రష్ రష్మిక మందన్నాకు సంబంధించిన ఓ మార్ఫింగ్ వీడియో ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశమవుతోంది. జారా పటేల్ అనే ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌కి సంబంధించిన వీడియోకి రష్మిక ముఖాన్ని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అదికాస్తా వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పలువురు స్టార్స్ ఇప్పటికే మండిపడిన విషయం తెలిసిందే. బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, టాలీవుడ్ స్టార్ హీరో నాగచైతన్య సహా పలువురు ఇప్పటికే రష్మికకు మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో జారా పటేల్ కూడా మార్ఫింగ్ వీడియోపై స్పందించింది. ఈ వీడియో మార్ఫింగ్‌లో తన ప్రమేయం ఏమీ లేదని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించింది. వీడియో చూసి తీవ్రంగా కలత చెందినట్లు చెప్పింది. 'అందరికీ హాయ్, నా శరీరాన్ని, ప్రముఖ బాలీవుడ్ నటి (రష్మికను ఉద్దేశిస్తూ) ముఖాన్ని ఉపయోగించి ఎవరో డీప్‌ఫేక్ వీడియోను రూపొందించినట్లు నా దృష్టికి వచ్చింది. డీప్‌ఫేక్ వీడియోతో నాకు ఎలాంటి ప్రమేయం లేదు. ఈ ఘటనతో నేను తీవ్రంగా కలత చెందాను. ఆందోళనకు గురయ్యా. భవిష్యత్తులో మహిళలు, ఆడపిల్లల భద్రత గురించి తలుచుకుంటే భయమేస్తోంది. సోషల్ మీడియాలో తమ ఫొటోలను పోస్ట్ చేసే విషయంలో మహిళలు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలి. ఇంటర్నెట్‌లో కనిపించేది అంతా నిజం కాదు. నిజానిజాలేమిటో తెలుసుకొన్న తర్వాత నిర్ధారణకు వస్తే మంచిది' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. జారా పటేల్ ఓ బ్రిటిష్-ఇండియన్ ఇన్‌ఫ్లూయెన్సర్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4.5 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇక సోషల్ మీడియాలో జారా ఎక్కువగా బోల్డ్ కంటెంట్‌ను షేర్ చేయడంలో గుర్తింపు పొందింది. ఆమె ఇన్‌స్టా బయో ప్రకారం.. జారా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో డేటా ఇంజినీర్‌గా పనిచేస్తోంది. అదేవిధంగా తానో మానసిక ఆరోగ్య న్యాయవాది అని బయోలో పేర్కొంది. ఎక్కువగా తన ఫాలోవర్స్ కోసం అడల్ట్ కంటెంట్‌ను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుంటుంది. ఈ క్రమంలో అక్టోబర్ 9వ తేదీన ఓ వీడియో పోస్ట్ చేసింది. ఆ వీడియోనే కొందరు రష్మిక ఫేస్‌తో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. కొందరు ఆకతాయిలు ఫొటోను మార్ఫింగ్ చేసి ఓ అసభ్యకర వీడియో ను సృష్టించారు. వీడియోలో రష్మిక బాగా ఎక్స్‌పోజింగ్ చేసినట్టు కనిపిస్తుంది. వీడియో చూసిన అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యా రు. రష్మిక ఏంటి.. ఇలా తయారైంది అంటూ మాట్లాడుకున్నారు. దీనిపై అనుమానం వచ్చిన కొందరు నెటిజన్లు.. అసలు నిజాన్ని బయటపెట్టారు. ఇది ఒరిజినల్ వీడియో జారా పటేల్ అనే ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌కి సంబంధించినదిగా తేల్చారు. ఆమె వీడియోని ఎవరో రష్మిక ఫేస్ తో అనుమానం రాకుండా మార్ఫింగ్ చేసి రిలీజ్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఒరిజినల్ వీడియో, రష్మిక డీప్‌ఫేక్ మార్ఫింగ్ వీడియోను షేర్ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్‌కూడా స్పందించారు. వీడియోపై సీరియస్ అయ్యారు. వెంటనే యాక్షన్ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అక్టోబర్ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' రేసులో దూసుకొచ్చిన బుమ్రా



అక్టోబర్ నెలలో 'ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు' కోసం ఐసీసీ పోటీదారులను ప్రకటించింది. గత నెలలో తమ ప్రదర్శనతో ప్రకంపనలు సృష్టించిన ముగ్గురు పురుష ఆటగాళ్ల పేర్లు వెలుగు లోకి వచ్చాయి. ఈ అవార్డుకు పోటీ దారులలో భారత్ కు చెందిన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, దక్షిణాఫ్రికాకు చెందిన వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ క్వింటన్ డి కాక్, న్యూజిలాండ్‌కు చెందిన యువ బ్యాటింగ్ ఆల్ రౌండర్ రచిన్ రవీంద్ర ఉన్నారు. పేరు ఎంపిక చేయబడింది. గత నెలలో జరిగిన ప్రపంచ కప్ 2023 లో ఈ ముగ్గురు ఆటగాళ్లు తమ జట్ల తరపున అద్భుతంగా ఆడారు. గత నెలలో ఆడిన మ్యాచ్‌ల్లో జస్ప్రీత్ బుమ్రా భారత్ తరపున అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన ఇచ్చాడు. కొత్త బంతితో పాటు మిడిల్ ఓవర్లలో కూడా వికెట్లు పడగొట్టాడు. దీని కారణంగా భారత జట్టు ప్రదర్శన అద్భుతంగా ఉంది. బుమ్రా ఆరు మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ కేవలం 3.91 మాత్రమే. అదే సమయంలో ఆఫ్ఘనిస్తాన్‌పై 4/39 గణాంకాలు కూడా బుమ్రా అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా నిలిచింది. క్వింటన్ డి కాక్ ప్రపంచ కప్ 2023 తర్వాత రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే అతని ప్రదర్శనను చూసి, ఆటగాడు తన నిర్ణయాన్ని మార్చుకోవాలని అందరూ కోరుకుంటున్నారు. దక్షిణాఫ్రికాకు ఓపెనింగ్‌గా, అతను గత నెలలో ఆరు ఇన్నింగ్స్‌లలో మూడు సెంచరీలతో సహా 71.83 సగటుతో 431 పరుగులు చేశాడు. రచిన్ రవీంద్ర తన అరంగేట్రం ప్రపంచకప్‌లో అద్భుతమైన ముద్ర వేశాడు. గత నెలలో చాలా అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. అతను తన మొదటి మ్యాచ్‌లోనే ఇంగ్లండ్‌పై అద్భుతమైన సెంచరీని సాధించి జట్టును సులభంగా గెలిపించడంలో దోహదపడ్డాడు. ఆ తర్వాత భారత్‌పై 75 పరుగులు, ఆస్ట్రేలియాపై సెంచరీతో ఆకట్టుకున్నాడు. 23 ఏళ్ల ఆటగాడు అక్టోబర్ నెలలో ఆరు మ్యాచ్‌ల్లో 81.20 సగటుతో 406 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో మూడు వికెట్లు కూడా తీసుకున్నాడు. మహిళల విభాగంలో ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు కోసం వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్, న్యూజిలాండ్ ఆల్ రౌండర్ అమేలియా కెర్, బంగ్లాదేశ్ స్పిన్నర్ నహిదా అక్తర్‌లను ఐసీసీ ఎంపిక చేసింది.

# బంగ్లా కెప్టెన్ షకిబ్ వెనక్కి తగ్గలేదు!




శ్రీలంక సీనియర్ ఆటగాడు ఏంజెలో మాథ్యూస్ 'టైమ్డ్ ఔట్'గా పెవిలియన్ చేరడం వివాదాస్పదంగా మారింది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఇదే పెద్ద చర్చనీయాంశంగా మారింది. బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ హల్ హాసన్ క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించాడని నెటిజన్లు మండిపడుతున్నారు. మరోవైపు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదని పలువురు క్రికెట్ మాజీలు అంటున్నారు. అయితే ఈ వివాదంలో మరో విషయం వెలుగులోకి వచ్చింది. అప్పీల్‌ను ఉపసంహరించుకుంటావా? అని అంపైర్లు రెండుసార్లు అడిగినా.. షకిబ్ వెనక్కి తగ్గలేదట. ఈ విషయాన్ని వెస్టిండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్ తెలిపాడు. వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా సోమవారం ఢిల్లీలో బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఏంజెలో మాథ్యూస్ టైమ్డ్ ఔట్‌గా పెవిలియన్‌కు చేరాడు. మాథ్యూస్ నిర్ణీత సమయం 2 నిమిషాల కన్నా ఆలస్యంగా బ్యాటింగ్‌కు వచ్చినందుకు టైమ్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. వికెట్ పడిన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన మాథ్యూస్.. గార్డ్ తీసుకోకుండా హెల్మెట్ కోసం ఎదురు చూశాడు. సమయం మించిపోవడంతో బంగ్లా కెప్టెన్ షకిబ్ హల్ హాసన్ ఔట్ కోసం అప్పీలు చేయగా.. ఫీల్డ్ అంపైర్లు ఔట్‌గా ప్రకటించారు.ఆన్-ఫీల్డ్ అంపైర్లు మరైస్ ఎరాస్మస్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్.. అప్పీల్‌ను ఉపసంహరించుకోవాలనుకుంటున్నారా? అని షకీబ్‌ను రెండుసార్లు అడిగారు. ఫోర్త్ అంపైర్ అడ్రియన్ హెూల్డ్‌స్టాక్ అడిగినా షకీబ్ తన నిర్ణయం మార్చుకోలేదు. ఈ విషయాన్ని ఇయాన్ బిషప్ చెప్పాడు. 'మాథ్యూస్ ఔట్ కోసం బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ అప్పీలు చేశాడు. అప్పీల్ వెనక్కి తీసుకుంటావా? అని అంపైర్లు రెండుసార్లు షకిబ్‌ను అడిగినా.. రెండుసార్లూ 'లేదు.. లేదు' అని జవాబిచ్చాడు. దాంతో నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అంపైర్లు ఔట్‌గా ప్రకటించారు' అని ఇయాన్ బిషప్ తెలిపాడు. 2007లో భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కూడా 'టైమ్డ్ ఔట్' కావాల్సి ఉంది. అప్పటి దక్షిణాఫ్రికా కెప్టెన్ గ్రేమ్ స్మిత్ అప్పీలు చేయకుండా.. దాదా కోసం ఎదురుచూశాడు. ఈ విషయాన్ని పలువురు అభిమానులు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. షకిబ్ తీసుకున్న నిర్ణయంపై మాజీ క్రికెటర్లు గౌతమ్ గంభీర్, డేల్ స్టెయిన్.. ఆస్ట్రేలియా టెస్టు ప్లేయర్ ఉస్మాన్ ఖవాజా స్పందించారు. ఈ సంఘటన అత్యంత దారుణం అని, ఇది సరైంది కాదని వారు పేర్కొన్నారు.

# భారత అభిమానుల వల్లే ఈ విజయాలు : హష్మతుల్లా షాహిది

భారత గడ్డపై జరుగుతున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2023లో పసికూన అఫ్గానిస్థాన్ అంచనాలకు మించి రాణిస్తోంది.మెగా టోర్నీని మామూలుగానే ఆరంభించిన అఫ్గాన్.. ఆ తర్వాత అనూహ్య ప్రదర్శనతో చెలరేగుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌తో పాటు మాజీ ఛాంపియన్స్ పాకిస్థాన్, శ్రీలంకకు పెద్ద షాక్ ఇచ్చింది. ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌లలో నాలుగు గెలిచి.. సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. మిగిలిన 2 మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో అఫ్గాన్ ఆడాల్సి ఉంది. రెండు మ్యాచ్‌లలో గెలిస్తే అఫ్గాన్ సెమీస్ చేరుతుంది. ప్రపంచకప్ 2023లో అఫ్గానిస్థాన్ రాణించడానికి భారత అభిమానుల మద్దతే కారణమని కెప్టెన్ హష్మతుల్లా షాహిది తెలిపాడు. మైదానంలోనే కాదు బయట కూడా ఫాన్స్ తమని ఎంతో గౌరవిస్తున్నారని చెప్పాడు. భారత అభిమానులకు తాము రుణపడి ఉంటామని అఫ్గాన్ కెప్టెన్ పేర్కొన్నాడు. ప్రపంచకప్ 2023లో భాగంగా నేడు ఆస్ట్రేలియాతో అఫ్గానిస్థాన్ తలపడనుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ మ్యాచ్ ఆరంభం కానుంది. ఈ మ్యాచ్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన హష్మతుల్లా షాహిది పలు విషయాలపై స్పందించాడు. ప్రపంచకప్ 2023లో మా ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నాం. భారత అభిమానులు ఇచ్చిన మద్దతు వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. అఫ్గాన్ ఆడిన ప్రతి మ్యాచ్‌కు భారీగా స్థాయిలో ఫాన్స్ స్టేడియానికి వచ్చి.. మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఇది మాకెంతో స్ఫూర్తినిస్తోంది. మైదానంలోనే కాదు బయటకు వెళ్లినా గౌరవిస్తున్నారు. ఓ ట్యాక్సీ డ్రైవర్ నన్ను బయటకు తీసుకెళ్లి డబ్బులు కూడా తీసుకోలేదు. ప్రపంచకప్‌లో ఇదివరకు ఒకే మ్యాచ్ గెలిచాం. ఈసారి కచ్చితంగా మెరుగైన ప్రదర్శన చేస్తామనే నమ్మకంతో బరిలో దిగాం. సెమీస్ మా లక్ష్యం' అని హష్మతుల్లా షాహిది చెప్పాడు.

# నా జట్టు గెలుపు కోసం ఏమైనా చేయాలనిపించింది

వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక సీనియర్ ఆటగాడు ఏంజెలో మాథ్యూస్ టైమ్డ్ ఔట్‌గా పెవిలియన్‌కు చేరాడు. మాథ్యూస్ నిర్ణీత సమయం (2 నిమిషాలు) కన్నా ఆలస్యంగా బ్యాటింగ్‌కు వచ్చి.. టైమ్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. వికెట్ పడిన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన మాథ్యూస్.. గార్డ్ తీసుకోకుండా హెల్మెట్ (కొత్త హెల్మెట్) కోసం వేచి చూశాడు. సమయం మించిపోవడంతో బంగ్లా కెప్టెన్ షకిబ్ హల్ హాసన్ ఔట్ కోసం అప్పీలు చేయగా.. అంపైర్లు అతడిని ఔట్‌గా ప్రకటించారు. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడని షకిబ్‌పై విమర్శలు వస్తున్నాయి. వీటిపై షకిబ్ స్పందించాడు. తాను ఆటలోని నిబంధనల ప్రకారమే ఆడుతున్నానని, ఎవరికైనా సమస్య ఉంటే నిబంధనలను మార్చమని ఐసీసీని కోరాలని బంగ్లా కెప్టెన్ షకిబ్ హల్ హాసన్ ఘాటుగా స్పందించాడు. ఆ సమయంలో తన జట్టు గెలుపు కోసం ఏమైనా చేయాలనిపించిందన్నాడు. 'నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. ఏంజెలో మాథ్యూస్ ఇంకో హెల్మెట్ కోసం అడిగాడు. ఆ సమయంలో నా సహచర ఆటగాడు నా దగ్గరకు వచ్చి మనం అప్పీల్ చేస్తే.. అంపైర్ మాథ్యూస్‌ని ఔట్‌గా ప్రకటిస్తాడని చెప్పాడు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com